## సంపాదకీయం

**గురువారం 06-11-2025**

# వృద్ధి బాటలో అవాంతరాలెన్నో

అవకాశాలున్నా అందిపుచ్చుకోలేని అశక్తత అంటే ఏంటో భారతదేశ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐల) తీరును చూస్తే అర్థమవుతుంది. 2024-25లో దేశంలోకి స్థూల ఎఫ్‌డీఐల ప్రవాహం అయిదు వేల కోట్ల డాలర్లకు పైనే ఉన్నట్లు కనిపిస్తోంది. కానీ, నికర ఎఫ్‌డీఐలు మాత్రం 90శాతం పడిపోయాయి. గతంలో వచ్చిన విదేశీ పెట్టుబడులు మరలి పోవడమే దీనికి కారణం. మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, జాతీయ పారిశ్రామికోత్పత్తి విధానాల కింద దేశవిదేశీ పెట్టుబడులను భారీగా ఆకర్షించాలని ఇండియా తాపత్రయపడుతున్న వేళ ఎఫ్‌డీఐలు తగ్గడం ఆందోళనకరం!పలు దేశాల్లో వ్యాపారం చేసే బహుళజాతి కంపెనీలు భారతదేశం దీర్ఘకాలంలో కీలక మార్కెట్‌గా అవతరిస్తుందని భావిస్తున్నాయి. కానీ, ఇక్కడ ఆర్జించిన లాభాలను మళ్లీ ఇక్కడే మదుపు చేయడానికి మాత్రం అవి వెనకాడుతున్నాయి. పన్ను విధానాలు, రాజకీయాల్లో అనిశ్చితి, వివాదాల పరిష్కారానికి ఎక్కువకాలం పట్టడం వంటి కారణాలు ఆ సంస్థలను వెనక్కి లాగుతున్నాయి. ఇది చాలదన్నట్లు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన సుంకాల యుద్ధం, అమెరికా-చైనా వైరం, అమెరికా ద్రవ్యవిధానం కలగలిసి అంతర్జాతీయ ఆర్థికాన్ని అస్థిమితం చేస్తున్నాయి. దాంతో భారత్ వంటి వర్ధమాన దేశాల నుంచి విదేశీ పెట్టుబడులు తరలిపోతున్నాయి. కరెంటు ఖాతా లోటు, ఎగుమతుల తగ్గుదలతో సతమతమవుతున్న ఇండియాలో ఎఫ్‌డీఐలు నిలిచిపోవడం వల్ల- భారీ పెట్టుబడులు, అధునాతన సాంకేతికతలు అవసరమైన హరిత పరిశ్రమల్లో ప్రగతి కుంటుపడుతుంది. దీన్ని నివారించడానికి ప్రభుత్వం సత్వరమే నడుం బిగించాలి. అంతర్జాతీయ పెట్టుబడిదారుల నమ్మకాన్ని తిరిగి చూరగొనడంతో పాటు కీలక రంగాల్లో దీర్ఘకాలిక పెట్టుబడులు, సాంకేతికతలకు ఎర్రతివాచీ పరవాలి.

పెట్టుబడులకు భరోసా కల్పిస్తే...

ఇటీవలి కాలంలో దేశంలోకి విదేశీ పెట్టుబడులు తగ్గడానికి కారణాలేంటో సమీక్షించుకోవాల్సిన అవసరముంది. 2020 గల్వాన్ ఘర్షణల తరవాత- సరిహద్దు దేశాల నుంచీ, ప్రధానంగా చైనా నుంచి ఎఫ్‌డీఐలు రావాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి అని భారత్ షరతు పెట్టింది. నాటి పరిస్థితుల్లో అది సరైన నిర్ణయమే కానీ- ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్, ఆటో విడిభాగాల పరిశ్రమల్లో పెట్టుబడులకు గండికొట్టింది. దాంతో దేశంలోని ముఖ్య పరిశ్రమల పురోగతికి ఆటంకం ఏర్పడింది. మారిన పరిస్థితుల్లో పాత వ్యూహాన్ని భారత్ సవరించుకుంటోంది. చైనా పెట్టుబడుల్లో 24శాతాన్ని నేరుగా అనుమతించే అంశాన్ని నీతిఆయోగ్ పరిశీలిస్తోంది. ఇది హైటెక్ పరిశ్రమల్లో ఎఫ్‌డీఐల వృద్ధికి తోడ్పడుతుంది. భద్రతాపరంగా తగిన జాగ్రత్తలతో ఎఫ్‌డీఐలను అనుమతించాలనీ, రాజకీయపరమైన భావోద్వేగాలు ఆర్థిక అనివార్యతలకు అడ్డురాకుండా చూసుకోవాలనీ భారత్ ఇప్పటికే గ్రహించింది.ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశం మనది. 2045 వరకు ఇదే ఒరవడి కొనసాగనుంది. ఈ శ్రామికశక్తిని నియోగించి ఆర్థికంగా, పారిశ్రామికంగా పురోగమించడానికి దండిగా స్వదేశీ, విదేశీ పెట్టుబడులు కావాలి. అందుకు సంస్థాగత సంస్కరణలు అవసరం. ముందుగా మదుపరులకు తమ పెట్టుబడులు భద్రమనే భరోసా కల్పించాలి. విధానాల్లో ఆకస్మికంగా అనూహ్యమైన మార్పులు తీసుకొచ్చి గందరగోళం సృష్టించకూడదు. పెట్టుబడుల రక్షణకు పూచీకత్తునిచ్చే నిబంధనావళిని రూపొందించి తటస్థ సంస్థల ద్వారా అమలుపరచాలి. పన్నుల్లో, నిబంధనల్లో మార్పులను వెనకటి తేదీ నుంచి అమలు చేయబోమని భరోసా ఇవ్వాలి. హైదరాబాద్, ముంబయిలలోని మధ్యవర్తిత్వ కేంద్రాల ద్వారా అంతర్జాతీయ ఆర్థిక వివాదాలను వేగంగా పరిష్కరించే ఏర్పాట్లు చేయాలి. భారతదేశంలో వ్యాపారం ద్వారా ఆర్జించిన లాభాలను స్వదేశానికి తరలించకుండా అడ్డుపడే విధానాలన్నాబీ ఏ కారణం వల్లనైనా ఇక్కడ తమ వ్యాపారాలను నిలిపేయడానికి అడ్డుపడే నిబంధనలన్నా బహుళ జాతి సంస్థలకు నచ్చవు. సింగపూర్‌లో మాదిరిగా వేగంగా వ్యాపారాలను బంద్ చేయడానికి అనుమతించే నిబంధనలు భారత్‌లోనూ రావాలని అవి కోరుకుంటున్నాయి. దీని గురించి ప్రభుత్వం ఆలోచించాలి. కేంద్రం చేపట్టిన ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం(పీఎల్ఐ)... ఫాక్స్‌కాన్, విస్ట్రాన్, పెగాట్రాన్ వంటి కంపెనీలు భారత్‌లో ఎలక్ట్రానిక్ పరిశ్రమలను స్థాపించేలా ప్రేరణనిచ్చింది. ఇక విద్యుత్ వాహనాలకు బ్యాటరీలను తయారుచేసే పరిశ్రమలతో పాటు సెమీకండక్టర్లు, ఏరోస్పేస్, వైద్య పరికరాల తయారీ పరిశ్రమలను రప్పించాల్సి ఉంది. ఈ రంగాల్లో నూరు శాతం ఎఫ్‌డీఐలను అనుమతించాలి. గ్రీన్ హైడ్రోజన్ ఇతర పునరుత్పాదక ఇంధన పరిశ్రమలు, కర్బన ఉద్గారాల తటస్థ పరిశ్రమల్లోకి ఎఫ్‌డీఐలను ఆకర్షించడం, విదేశాల సహభాగస్వామ్యంతో ముందుకుసాగడం అత్యావశ్యకం. తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారుల సదస్సులను నిర్వహించి స్వదేశీ, విదేశీ పెట్టుబడులను పెద్దయెత్తున ఆకర్షిస్తున్నాయి. ఇకపై జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాలకూ ఎఫ్‌డీఐలను ఆకర్షించేలా సదస్సు నిర్వహించాలి. ఆత్మనిర్భర్ భారత్ ఛత్రం కింద విదేశీ పెట్టుబడులు, సాంకేతికతలు, నిర్వహణా నైపుణ్యంతో పాటు అంతర్జాతీయ సరఫరా గొలుసుల్లో భాగస్వామ్యాన్ని కూడా ఆహ్వానించాలి. తద్వారా స్వదేశీ కంపెనీలు ప్రపంచ మార్కెట్‌లో పోటీపడే సత్తాను సమకూర్చుకోవాలి.

విధానపరమైన మార్పులతోనే...


రక్షణ పేరుతోనో, వ్యూహపరమైన అంచనాలతో ఎఫ్‌డీఐను నిరాకరించడం వల్ల తాత్కాలికంగా లబ్ధి చేకూరవచ్చు. కానీ, దీర్ఘకాలంలో అది నష్టదాయకమే అవుతుంది. విదేశీ భాగస్వామ్యాలను ఆహ్వానించి, ఆపై అంతర్జాతీయ సరఫరా గొలుసుల్లో ఆధిక్యం సాధించడమనే వ్యూహాన్ని చైనా విజయవంతంగా అమలు చేసింది. భారత్‌కూ ఇది అనుసరణీయం. నేడు ప్రపంచంలోని ప్రధాన దేశాలు స్వీయ వాణిజ్య రక్షణకు అధిక ప్రాధాన్యమిస్తున్నాయి. దాంతో వాణిజ్య వైరాలు ముదురుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో దేశంలోకి ఎఫ్‌డీఐలు తేలిగ్గా ప్రవహించడానికి వీలుగా ప్రభుత్వం విధానపరమైన మార్పులు తీసుకురావాలి. ఏకగవాక్ష డిజిటల్ విధానంలో అధికారులు వేగంగా అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలి. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుని, పెట్టుబడి ప్రతిపాదనలను ఆహ్వానించాలి. స్వావలంబననూ, అంతర్జాతీయ సహకారాన్నీ సమర్థంగా మేళవించాలి. నమ్మకం, పారదర్శకత, జవాబుదారీతనాలతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించి ఆర్థికంగా దూసుకుపోవడమే ఇప్పుడు ఇండియా చేయాల్సిన పని!

# రీయింబర్స్‌మెంట్ అడిగితే విజిలెన్స్ దాడులా?



హైదరాబాద్,పెండింగ్‌లో ఉన్న ఫీజులను చెల్లించడానికి ముందు కురాని రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనతో విద్యార్థులే ముందుగా ఫీజులు చెల్లించే విధంగా చేస్తుంది. అంతిమంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్రకు పాల్పడుతుంది. ప్రపంచ అందాల పోటీలకు వందల కోట్ల రూపాయలను ఖర్చు చేశారు. రీయింబర్స్‌మెంట్ అంటే కేవలం ప్రైవేట్ విద్యాసంస్థల సమస్యగా రాష్ట్ర ప్రభుత్వం చిత్రీకరిస్తుంది. దీని వెనక దాదాపు 12 లక్షల మంది పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తు నెలకొని ఉంది.రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఇవ్వవలసిన రూ. 8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ పెండింగ్‌లో ఉన్నాయి. విద్యాసంస్థల ఆందోళనలు, విద్యార్థి సంఘాల పోరాటాల ఫలితంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ. 1200 కోట్ల రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేస్తామని, దానిలో రూ. 600 కోట్లను దసరాకు, మిగతా రూ. 600 కోట్లను దీపావళికి ఇస్తామని ప్రకటించింది. విద్యాసంస్థలు, విద్యార్థి సంఘా లు సర్కార్ ప్రకటనను నమ్మాయి. కానీ పండగల పేరుతో కాలయాపన జరిగింది గాని విద్యార్థులకు న్యాయం జరగలేదు.ఫలితంగా ఎప్పటి లాగానే లక్షలాది మంది విద్యార్థులు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ రాక, ఆర్థిక భారం తో చదువులను కొనసాగించలేక, ఉన్నత చదువులు చదువుకోలేక తీవ్రమైన ఆందోళనలో ఉన్నారు. 2023 సాధారణ అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. ప్రతి సంవత్సరం రెగ్యులర్‌గా ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం వెంటనే చెల్లిస్తామని నమ్మ బలికింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ అంశాన్ని చేర్చింది. కానీ ఎన్నికల్లో ఇచ్చిన రీయింబర్స్‌మెంట్ హామీని అటకెక్కించింది. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయని ప్రభుత్వం ఈ సంవత్సరం నుండి మరొక కొత్త కుట్రకు తెరలేపింది.రీయింబర్స్‌మెంట్‌ను కాలేజ్ అకౌంట్‌లో కాకుండా నేరుగా విద్యార్థి అకౌంట్‌లో వేస్తామని ప్రకటించింది. దీంతో ప్రైవేట్ విద్యాసంస్థలే కాకుండా ప్రభుత్వ విద్యాసంస్థల్లో కూడా మొత్తం ఫీజు ముందు చెల్లిస్తేనే వారికి ఆయా కాలేజీల్లో సీట్లు కన్ఫర్మ్ చేస్తున్నారు. దీంతో తీవ్రమైన ఆర్థిక భారం పేద విద్యార్థులపై పడుతుంది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ఫీజులను చెల్లించడానికి ముందుకురాని రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనతో విద్యార్థులే ముందుగా ఫీజులు చెల్లించే విధంగా చేస్తుంది. అంతిమంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్రకు పాల్పడుతుంది. ప్రపంచ అందాల పోటీలకు వందల కోట్ల రూపాయలను ఖర్చు చేశారు. రీయింబర్స్‌మెంట్ అంటే కేవలం ప్రైవేట్ విద్యాసంస్థల సమస్యగా రాష్ట్ర ప్రభుత్వం చిత్రీకరిస్తుంది.దీని వెనక దాదాపు 12 లక్షల మంది పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తు నెలకొని ఉంది. రాష్ట్రంలో ఉన్న ఉస్మానియా, కాకతీయ, మహాత్మా గాంధీ, జెఎన్‌టియు, తెలంగాణ యూనివర్శిటీ లాంటి ప్రతిష్ఠాత్మకమైన ప్రభుత్వ యూనివర్శిటీలకు కూడా వందల కోట్ల పెండింగ్ బిల్లులు రావలసి ఉంది. ఈ యూనివర్శిటీలన్నీ నిధులు లేక, సౌకర్యాలు లేక, చదువు చెప్పే ప్రొఫెసర్లు లేక దినదినగండం నూరేళ్ల ఆయుష్షుగా కొనసాగుతున్నాయి. ఈ పెండింగ్ నిధులు విడుదలయితే కొంతైనా పరిస్థితి మెరుగుపడవచ్చు. ప్రజాస్వామ్యాన్ని 7వ గ్యారెంటీగా ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ అడిగిన విద్యార్థులపై, విద్యార్థి సంఘాల నాయకులపై కక్ష గట్టింది. విద్యార్థుల పోరాటాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేసింది.రీయింబర్స్‌మెంట్ సాధించడం కోసం అనేక సార్లుగా ఆందోళనలు చేసినా, పోరాటాలు నిర్వహించినా, విద్యాసంస్థల బందును నిర్వహించినా కూడా కనీసం స్పందించలేదు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యాసంస్థలను మూసివేస్తామని హెచ్చరించిన ఫలితంగా వారితో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. నేడు వారి హామీని నెరవేర్చని ఫలితంగా మరొకసారి నిరవధికంగా నవంబర్ 3 నుండి విద్యాసంస్థలను మూసివేస్తామని ప్రకటించాయి. దీనికి ప్రతిగా ప్రభుత్వం విద్యాసంస్థలపై విజిలెన్స్ దాడులు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రైవేటు విద్యాసంస్థలు నిబంధనలు పాటించకుంటే విద్యా సంవత్సరం ప్రారంభంలోనే నిబంధనలు పాటించే విధంగా చర్యలు తీసుకోవలసిన రాష్ట్ర విద్యాశాఖ అధికారులు నాడు చోద్యం చూసింది. ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు, ప్రైవేట్ యూనివర్శిటీలు ఏమాత్రం నిబంధనలు పాటించకుండా లక్షలరూపాయలను డొనేషన్ల పేరుతో వసూలు చేస్తున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు.అనేక ప్రైవేట్ విద్యాసంస్థలు నిబంధనలు పాటించకుండా అక్రమంగా ఫీజులు పెంచుకున్నప్పుడు, సరైన సదుపాయాలు కల్పించనప్పుడు, నిబంధనలకు తూట్లు పొడిచినప్పుడు, విద్యారంగంపై ఉన్న జిఒలను అమలు చేయనప్పుడు విద్యార్థి సంఘాలు ఉద్యమిస్తే నాడు పట్టించు కోలేదు. కాని నేడు రీయింబర్స్‌మెంట్ అడగగానే విజిలెన్స్ దాడులు చేస్తామని బెదిరించడం ఎంతమాత్రం సబబు కాదు. రీయింబర్స్‌మెంట్ విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామికంగా వ్యవహరించకుండా భేషజాలకు పోతే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు. విద్యా సంవత్సరాన్ని కోల్పోతారు. ఈ సమస్యను పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం దాడుల పేరుతో బెదిరింపులకు పాల్పడటం శోచనీయం. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదలపై ఉద్యమించాల్సిన గురుతర బాధ్యత నేడు విద్యార్థి లోకంపై ఉంది. ఐక్యపోరాటాలను నిర్మించాల్సిన తక్షణ కర్తవ్యం నేడు విద్యార్థి సంఘాలపై ఉంది.

# క్వాంటం వ్యాలీ నుంచి గూగుల్ ఏఐ హబ్‌దాకా..




న్యూఢిల్లీ,భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించి, సామాజిక పురోగతి, పర్యావరణ స్థిరత్వం, సుపరిపాలన, ఉపాధి కల్పన, నవ్యావిష్కరణలకు నెలవైన అభివృద్ధి చెందిన దేశంగా రూపొందాలనే ప్రధాని నరేంద్ర మోడీ 'వికసిత భారత్ ఏ2047' లక్ష్యాన్ని చేరాలంటే ఆధునిక ప్రపంచంలో విప్లవాత్మక మార్పులకు కారకమౌతున్న ఏఐ, క్వాంటం కంప్యూటింగ్‌లపై పట్టు సాధించాలి. ఈ దిశగా దేశ ప్రస్థానాన్ని కీలక మలుపు తిప్పే రెండు చారిత్రాత్మక ఘట్టాలకు చంద్రబాబు నాయ కత్వంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వేదికయ్యింది.మొదటిది క్వాంటం టెక్నాలజీ పరిశోధనలకు, ఆవిష్క రణలకు కేంద్రంగా అమరావతిలో భారతదేశపు మొట్ట మొదటి క్వాంటం వ్యాలీ ప్రారంభానికి పునాది పడటం, రెండవది భారత్ పరిణామ క్రమానికి నాందిగా విశాఖ పట్నంలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మైక్రోసాఫ్ట్ రాకతో ఐటీ రంగం ఊపందుకున్నట్లే, ఈ కంపెనీల ఆగమనంతో ప్రపంచ డిజిటల్ మౌలిక వసతులకు కేంద్రంగా ఏపీ భాసిల్లబోతోంది.

డేటా సెంటర్ అనివార్యం కావడంతో..

గతంలో చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైటెక్ సిటీ నిర్మాణ సమయంలో కంప్యూటర్లు కూడు పెడతాయా? అని కొందరు అవహేళన చేసినట్లే ప్రస్తుత డేటా సెంటర్ కేంద్రంపై కొందరు కువిమర్శలు చేస్తూ ఒక గొప్ప అవకాశాన్ని కించపరిచే ప్రయత్నం చేస్తున్నారు. అంతర్జాలంలోని సమాచారాన్ని పెద్ద మొత్తంలో ఒకే చోట భద్రపరచి, క్రమబద్ధీకరించి, పంపిణీ చేయడానికి ఉప యోగించే కేంద్రాలే డేటా సెంటర్లు. ఇతర దేశాలలో వందలాది డేటా సెంటర్లు ఉన్నాయి. తాజాగా భారత ప్రభుత్వం మన డేటా వేరే దేశాల్లో ఉండకూడదనే నిబంధన విధించడం వలన మన దేశంలో డేటా సెంటర్ల ఏర్పాటు అనివార్యం అయింది. అయితే ఈ డేటా సెంటర్లలో విద్యుత్, నీటి వినియోగం అధికంగా ఉంటుందనేది నిజం. కానీ విశాఖలో స్థాపిస్తున్న గూగుల్ డేటా సెంటర్‌లో అత్యంత సమర్థమైన, ఆధునిక లిక్విడ్ కూలింగ్ సిస్టమ్ వినియోగించడం వలన నీటి వినియోగం తగ్గడంతో పాటు విద్యుత్ వినియోగం కూడా 20 శాతం తగ్గుతుంది. అలాగే ఈ డేటా సెంటర్ నిర్వహణకు కావలసిన 80 శాతం విద్యుత్ తమ స్వంత సౌర శక్తి ప్లాంట్ల ద్వారా వారే సమకూర్చుకోవడం వలన రాష్ట్రానికి అదనపు విద్యుత్ భారం ఉండదు. గ్లోబల్ నెట్‌వర్క్‌తో సముద్ర గర్భ, భూభాగపు కేబుల్ ద్వారా అనుసంధానించి, క్లీన్ ఎనర్జీతో పనిచేసే విధంగా గూగుల్ ఏఐ హబ్ డిజైన్ చేశారు.

ఉత్పత్తి పరిమాణం పెరగడంతో..

భారతదేశం ప్రపంచ డేటాలో 20 శాతం ఉత్పత్తి చేస్తున్న ప్పటికీ, డేటా సెంటర్ సామర్థ్యంలో దాని వాటా కేవలం 3 శాతం మాత్రమే. ప్రభుత్వం కార్యక్రమాలు, ఇంటర్నెట్ విస్తరణ, స్మార్ట్‌ఫోన్లు, ఈ-కామర్స్, వేగంగా డిజిటల్ సేవల విస్తరణ వలన డేటా ఉత్పత్తి పరిమాణం విపరీతంగా పెరుగుతోంది. వివిధ రంగాల వ్యాపార సంస్థలు క్లౌడ్ సేవలు, ఏఐ, బిగ్ డేటా అనలిటిక్స్‌ను వేగంగా స్వీకరిస్తున్నాయి. దీనివల్ల బలమైన డేటా సెంటర్ అవసరం మరింత పెరుగుతోంది. నవీ ముంబై ప్రస్తుతం ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో మూడవ అతిపెద్ద డేటా సెంటర్ మార్కెట్‌గా ఎదిగి షాంఘై, టోక్యో తర్వాత మూడవ స్థానంలో ఉంది. 2025 మార్చి నాటికి, భారతదేశంలో సుమారు 1,352 మెగావాట్లుగా ఉన్న మొత్తం డేటా సెంటర్ సామర్థ్యం.. 2030 నాటికి 4.5 గిగావాట్లు లేదా అంతకంటే ఎక్కువకు చేరుకోవచ్చనే అంచనాను విశాఖ సాకారం చేస్తోంది.

ఈ హబ్.. అవకాశాల గని!

డేటా సెంటర్ ఏర్పాటు చేయడానికి కావలసిన అతి ముఖ్యమైన అంతర్జాతీయ కేబుల్ లాండింగ్ స్టేషన్, సబ్ సీ కేబుల్ నెట్‌వర్క్ ముంబై, చెన్నై తరువాత విశాఖలో ఏర్పాటు కావడం వలన ఆసియా ఫసిఫిక్, అమెరికా దేశాలకు నేరుగా అనుసంధానించబడి విశాఖ ప్రపంచ స్థాయి కనెక్టివిటీ హబ్‌గా అభివృద్ధి చెందుతుంది. గూగుల్, టాటా గ్రూప్, అదానీ స్థాపిస్తున్న 3.5 గిగావాట్ల డేటా సెంటర్లతో విశాఖ భారతదేశ డిజిటల్ గేట్ వేగా రూపు దిద్దుకునే అవకాశం ఉంది. అమెరికా తర్వాత ప్రపంచంలో గూగుల్ నిర్మించబోయే అతిపెద్ద ఏఐ హబ్ అత్యాధునిక ఏఐ మౌలిక సదుపాయాలు, డేటా సెంటర్ సామర్థ్యం, భారీ స్థాయి ఇంధన వనరులు, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌లను ఒకేచోట సమన్వయ పరిచి విశాఖను కృత్రిమ మేధ పరి వర్తన కేంద్రంగా నిలబెడుతుంది.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై దృష్టి పెట్టాలి!

డేటా సెంటర్లు ఏర్పాటు అవుతుండటం వలన ఏఐ పరిశోధనలు, నిర్వహణ, అనుభవం ఉన్న మానవ వనరుల అవసరం చాలా ఎక్కువ. కనీసం లక్షన్నర పైగా ఉద్యోగాలు గూగుల్ ఏఐ హబ్ వలన లభించవచ్చు. అందుకే ప్రభుత్వం గూగుల్ ఏఐ హబ్ నిర్మాణానికి సమాంతరంగా స్కిల్ డెవలప్‌మెంట్ మీద మరింత దృష్టి పెట్టాలి. స్థానికంగా ఏఐ ఎకోసిస్టమ్ సృష్టిస్తే, మరిన్ని అంతర్జాతీయ కంపెనీలు విశాఖ వైపు ఆకర్షితమవుతాయి. ఇప్పటికే గూగుల్ భారత్‌ను ఔట్ సోర్సింగ్ కేంద్రంగా కాకుండా, తన ప్రధాన ఉత్పత్తి కేంద్రాల్లో ఒకటిగా చూస్తోంది. ఇక వికసిత భారత్ లక్ష్యాలకు అనుగుణంగా గూగుల్ వంటి సంస్థలు భారత్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, శిక్షణ, ప్రమాణాలు, సాంకేతిక ఆవిష్కరణలు తీసుకురావడం ద్వారా దేశ ఆర్థిక వృద్ధికి తోడ్పడటమే కాకుండా స్థానిక పరిశ్రమకు లాభం కలిగిస్తాయి. గూగుల్ విశాఖ కేంద్రం విజయవంతమైతే, గ్లోబల్ టెక్నాలజీ లీడర్‌గా, ప్రపంచ ఏఐ శక్తిగా భారత స్థానం సుస్థిరం కావడం ఖాయం.

## తెలంగాణలో క్రీడా ప్రోత్సాహక విధానాలు

హైదరాబాద్, తెలంగాణ ప్రభుత్వ క్రీడా ప్రోత్సాహక విధానాల వల్లనే పలు జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు హైదరాబాద్ వేదికగా మారుతోందని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన 'తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ చాలెంజ్ 2025' బ్యాడ్మింటన్ పోటీలను మంత్రి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం క్రీడల ప్రోత్సాహక విధానాన్ని అమలు చేస్తోంది. దాని ఫలితంగా హైదరాబాద్ మాత్రమే కాకుండా తెలంగాణలోని పలు జిల్లాల్లో కూడా భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ క్రీడా టోర్నమెంట్లు నిర్వహించే ప్రణాళిక ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ బ్యాడ్మింటన్ క్రీడకు హబ్ లాంటిదే. దేశానికి అనేక బ్యాడ్మింటన్ ఛాంపియన్లను అందించిన ఘనత తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి దక్కిందని అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, ఈ టోర్నమెంట్ విజయవంతంగా సాగేందుకు స్పోర్ట్స్ అథారిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని, గత రెండేళ్లలో అనేక మెగా ఈవెంట్లను విజయవంతంగా నిర్వహించిన ఘనత సంస్థకు దక్కిందని తెలిపారు. పద్మభూషణ్ పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ, ఈ టోర్నమెంట్ నిర్వహణలో స్పోర్ట్స్ అథారిటీ అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని అన్నారు.

# రైతుల త్యాగంతోనే అమరావతి నిర్మాణం

అమరావతి, రైతుల త్యాగంతోనే రాజధాని అమరావతి నిర్మాణం జరుగుతోందని రాష్ట్ర హోంమంత్రి అనిత  అన్నారు. తుళ్లూరులో డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి నిర్మాణం పూర్తిచేస్తాం. పోలీసులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. వారి ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యమిస్తాం. ప్రతిపక్షాల ఆరోపణలను దీటుగా ఎదుర్కొంటాం. పోలీసులపై తప్పుడు ప్రచారం చేయడం తగదు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులను సహించం. పోలీసులకు నూతన సాంకేతికతను అందిస్తాం. 6100 పోస్టులను భర్తీ చేస్తున్నాం అని అనిత అన్నారు.ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ... తుళ్లూరు పోలీస్ సభ డివిజన్ కొత్త ఆఫీస్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని.. దీని గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలని అన్నారు. 2014లో సీఎం చంద్రబాబు అమరావతి నిర్మాణం ప్రారంభించారని గుర్తుచేశారు. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ కార్యాలయం పూర్తి కాకుండా ఉందని తెలిపారు. రాజధాని కొరకు రైతులు ఉచితంగా భూములు త్యాగం చెయ్యడం గొప్ప విషయమన్నారు. అమరావతి రైతుల కష్టం.. ప్రతి ఫలమే ఇవాళ అందరూ చూస్తునారని హోంమంత్రి అన్నారు. ఈ బిల్డింగ్ పూర్తి చేయడానికి ఎస్పీ వకుల్ జిందల్, డీఎస్పీ మురళీ కృష్ణ చాలా కృషి చేశారని కొనియాడారు. పోలీస్ వ్యవస్థను బాగా బలోపేతం చేసేందుకు డీజీపీ కృషి చేస్తున్నారని తెలిపారు. పోలీసులకు కావాల్సిన అన్ని ఫెసిలిటీస్ కూడా ఈ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని చెప్పారు. పోలీసులకు కోటి రూపాయలు వరకు భీమా కల్పిచామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే 6100 మంది కానిస్టేబుల్ ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. పోలీసు చనిపోతే.. వారి కుటుంబానికి అండగా ఉంటామని.. భీమా ద్వారా కనిష్టంగా రూ.15 లక్షలు ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. ఈ సబ్ డివిజన్‌లో సిబ్బంది కొరత ఉందని.. త్వరలో అన్నీ ఫుల్ ఫిల్ చేస్తామని హోంమంత్రి స్పష్టం చేశారు. కల్పిత వీడియోల ద్వారా చాలా మంది ఇబ్బంది పెడుతున్నారని.. అలాంటి వాటిని ఏపీ పోలీసులు సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ మధ్య కాలంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ లారీపై రాళ్లు వేసిన వీడియోను.. ఆంధ్రప్రదేశ్‌లో జరిగినట్లు వైసీపీ ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు వార్తలను ఏపీ పోలీసులు సమర్థవంతంగా ఎదుర్కొన్నారని తెలిపారు. టెక్నాలజీ ఉపయోగించి.. తప్పుడు వార్తలు స్ప్రెడ్ కాకుండా చూడాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

# పెద్ద ప్లానింగే...

హైదరాబాద్,చామకూర మల్లారెడ్డి అలియాస్ మల్లన్న.. తెలంగాణ పొలిటీషియన్. అంతేకాదు తెలుగు రాష్ట్రాల్లో పరిచయం అక్కర్లేని పేరు. ఎంపీగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎంత ఫేమస్సో..ఆయన సరదా మాటలు, పంచ్ డైలాగులు కూడా బాగా ఫేమస్. ప్రస్తుతం ఆయన మేడ్చల్ నియోజకవర్గ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్నారు. మల్లారెడ్డి తెలంగాణలో విద్యా సంస్థల్ని నడుపుతున్నారు. డీమ్డ్ యూనివర్శటీలు. ఇంజినీరింగ్ కాలేజీలు, మెడికల్ కాలేజీలు, స్కూల్స్ ఉన్నాయి. అయితే మల్లారెడ్డి తన విద్యా సంస్థల్ని దేశ మొత్తం విస్తరించే పనిలో ఉన్నారు. ఈ క్రమంలో ఆయన తొలి అడుగు వేశారు.. అది కూడా ఏపీలో కావడం విశేషం.ఏపీలో తన విద్యా సంస్థల్ని విస్తరించే దిశగా అడుగు పడింది. మాజీ మంత్రి మల్లారెడ్డి ఇవాళ తిరుమల శ్రీవారి సేవలో పాల్గొన్నారు. కుటుంబ సమేతంగా వేంకటేశ్వరుడి సేవలో పాల్గొన్నారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల మాజీ మంత్రి మల్లా రెడ్డి కీలక ప్రకటన చేశారు. తాను తిరుపతిలో ఇటీవలే శ్రీ ఇంజినీరింగ్ కాలేజీని కొనుగోలు చేసినట్లు తెలిపారు. విశాఖపట్నంలో ఇటీవలే ఓ కాలేజీని కొనుగోలు చేశానని.. తిరుపతిలో సోమవారం రోజు కాలేజీని కొనుగోలు చేశానని, రిజిస్ట్రేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. ఆ తిరుమల శ్రీవారి దయతో తాను దేశమంతా యూనివర్సిటీలు, కాలేజీలు పెట్టబోతున్నట్లు చెప్పుకొచ్చారు. అంతేకాదు తెలంగాణలో మళ్లీ కేసీఆర్ అధికారంలోకి రావాలని తిరుమల శ్రీవారిని కోరుకున్నట్లు తెలిపారు. అయితే మల్లారెడ్డి తిరుపతిలో శ్రీ కాలేజీని కొనుగోలు చేయడం చర్చనీయాంశంగా మారింది.తిరుపతిలో శ్రీ కాలేజీని కొనుగోలు చేసిన మల్లారెడ్డి.. అక్కడ మల్లారెడ్డి బ్రాండ్‌తో విద్యా సంస్థను నడపాలని భావిస్తున్నారట. ఏపీలో మాత్రమే కాదు ఇతర రాష్ట్రాల్లో కూడా విద్యాసంస్థల్ని ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నారట. గతంలో ఉన్న కాలేజీలను కొనుగోలు చేయడంతో పాటుగా కొత్తగా కూడా కొన్ని విద్యా సంస్థల్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారట. తాను ప్రజా సేవ చేయడానికి యూనివర్శిటీలు, కాలేజలు నడిపిద్దామనుకుంటున్నట్లు ఇటీవల మల్లారెడ్డి చెప్పుకొచ్చారు. పాల మల్లారెడ్డిని కాస్త విద్యావేత్తగా ఎదిగానని.. దేశవ్యాప్తంగా డీమ్డ్ వర్సిటీలు, ఆస్పత్రులు స్థాపించి పేద ప్రజలకు విద్య, వైద్యాన్ని అందిస్తానన్నారు. మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి చెప్పినట్లుగానే విద్యా సంస్థల విస్తరణ చేపట్టారు.

# ఇవ్వలేం.. కష్టం..

హైదరాబాద్,తెలంగాణ రాష్ట్ర మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మరో ముఖ్యమైన హామీ నిలబడలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద కొత్తగా పెళ్లయిన మహిళలకు తులం బంగారం ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే తాజాగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు ఆ ఆశలపై నీళ్లు చల్లాయి.ఒక ప్రైవేట్ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ “ప్రస్తుతం బంగారం ధరలు అమాంతం పెరిగిపోయాయి. హామీ ఇచ్చిన సమయంలో తులం బంగారం ధర దాదాపు రూ.50 వేల వరకు మాత్రమే ఉండేది.కానీ ఇప్పుడు అది దాదాపు రూ.1.5 లక్షలకు చేరింది.ఈ పరిస్థితుల్లో ప్రభుత్వానికి ఆ భారాన్ని భరించడం అసాధ్యం”అని స్పష్టంగా తెలిపారు.

నిరాశలో మహిళలు.. విమర్శిస్తున్న ప్రతిపక్షం

ఈ ప్రకటనతో రాష్ట్ర వ్యాప్తంగా మహిళల్లో తీవ్ర నిరాశ నెలకొంది. ఎన్నికల సమయంలో ఈ హామీపై పూర్తి విశ్వాసం ఉంచిన లబ్ధిదారులు ఇప్పుడు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు అవుతున్నా, ఇప్పటివరకు ‘కళ్యాణ లక్ష్మి’ పథకం కింద బంగారం అందించడం జరగలేదు. ప్రస్తుతం కేవలం లక్ష రూపాయల చెక్కును మాత్రమే లబ్ధిదారులకు అందిస్తున్నారు.ఇదే అంశంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్రంగా మండిపడింది. “కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసింది. అమలు చేయలేని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు బంగారం ధరల పేరుతో మాట మార్చుకుంటోంది” అని బీఆర్ఎస్ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు.

రాజకీయంగా ప్రతికూల ప్రభావం?

రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఈ నిర్ణయం కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయ పరంగా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన అనేక హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శలు

## ట్రంప్ సుంకాలపై న్యాయవిచారణ

వాషింగ్టన్,అమెరికా చరిత్రలోనే అత్యంత కీలకమైన న్యాయవిచారణకు అగ్రరాజ్య సుప్రీంకోర్టు సిద్ధమవుతోంది. టారిఫ్‌ల పేరుతో ప్రపంచ దేశాలపై వాణిజ్య యుద్ధం సాగిస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారాలను నిర్ణయించే అంశంపై న్యాయస్థానం అమెరికా కాలమానం ప్రకారం బుధవారం విచారణ జరపనుంది. తాజాగా ట్రంప్ టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ పిటిషన్లు దాఖలు చేసిన చిన్న వ్యాపారులు, డెమోక్రాట్ పాలిత రాష్ట్రాల కూటమి తరఫున సుప్రీంకోర్టులో వాదనలు వినిపించేందుకు సిద్ధమవుతున్నారు. రెండోసారి అధికారంలోకి రాగానే ట్రంప్ మిత్ర, శత్రు భేదం లేకుండా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై సుంకాలతో విరుచుకుపడిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికార చట్టాన్ని ఉపయోగించి ట్రంప్ ఈ సుంకాలు విధించారని అమెరికా సర్కారు తెలిపింది. అయితే, ఈ చట్టాన్ని వినియోగించే క్రమంలో అధ్యక్షుడు ఫెడరల్ చట్టాలను ఉల్లంఘించారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ట్రంప్ నిర్ణయాన్ని కొన్ని న్యాయస్థానాలు అడ్డుకున్నాయి. ఈ క్రమంలోనే అమెరికా ప్రభుత్వం సుప్రీంకోర్టు ను ఆశ్రయించింది. దీనిపై బుధవారం విచారణ జరగనుంది. ఈ కేసులో ట్రంప్‌నకు వ్యతిరేకంగా భారత సంతతి అటార్నీ నీల్ కత్యాల్ వాదనలు వినిపించనున్నారు. దీంతో ఆయన పేరు ప్రస్తుతం అంతర్జాతీయ మీడియాలో మార్మోగుతోంది. 54 ఏళ్ల నీల్ కత్యాల్ షికాగోలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు భారత్ నుంచి వచ్చిన వలసదారులు. యేల్ లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నీల్.. మాజీ అధ్యక్షుడు ఒబామా హయాంలో యూఎస్ సొలిసిటర్ జనరల్‌గా వ్యవహరించారు. ఇప్పటివరకు అమెరికా సుప్రీంకోర్టులో 50కి పైగా కేసులను వాదించారు. గతంలో పలుమార్లు ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా నీల్ న్యాయస్థానాల్లో వాదించిన సందర్భాలున్నాయి. 2017లో ట్రంప్ తొలిసారి అధికారంలో కొన్ని దేశాలపై విధించిన ప్రయాణ ఆంక్షలకు వ్యతిరేకంగా నమోదైన కేసులను నీల్ వాదించారు. 'ఇంపీచ్: ది కేస్ అగైనెస్ట్ డొనాల్డ్ ట్రంప్' అనే పుస్తకాన్ని కూడా రచించారు. ఈ కేసు విచారణకు ట్రంప్ ప్రత్యక్షంగా హాజరుకావాలని తొలుత భావించారు. అయితే, కొన్ని కారణాల వల్ల ఆ ఆలోచనను విరమించుకున్నారు. ప్రభుత్వం తరఫున ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ హాజరుకానున్నారు. ఈ కేసు విచారణపై ట్రంప్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. ఇందులో మేం గెలిస్తే.. ప్రపంచంలోనే అత్యంత సంపన్న, సురక్షితమైన దేశంగా అమెరికా నిలుస్తుంది. ఒకవేళ ఓడిపోతే పేద దేశంగా మారుతుంది. అలా జరగొద్దని భగవంతున్ని కోరుకుంటున్నా అని రాసుకొచ్చారు.

## ప్లాన్ వర్కవుట్ అవుతుందా?

హైదరాబాద్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ రూటు మార్చిందా? కేవలం సెటిలర్స్ ఓట్లపై ఫోకస్ చేసిందా? ఇప్పటికే ఏపీలోని కూటమి పార్టీల మద్దతుదారులతో ఆ పార్టీ నేతలు మంతనాలు సాగిస్తున్నారా? గోపీనాథ్ మాదిరిగా సునీతకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారా? సెటిలర్స్ ఓట్లు ఎటువైపు తిరిగితే వారు విజయం సాధిస్తారని నేతలు బలంగా నమ్ముతున్నారు.

బీఆర్ఎస్ కొత్త స్ట్రాటజీ ఏంటి?

జూబ్లీహిల్స్ సిట్టింగ్ సీటు నిల బెట్టుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది బీఆర్ఎస్. అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని వినియోగించుకోవాలని భావిస్తోంది. ఆ నియోజకవర్గంలో తమకు 25-30 శాతం ఓటు బ్యాంకు బలంగా ఉందని నమ్ముతోంది. 10 శాతం ఓటర్లను తమ వైపు తిప్పుకుంటే సునాయాశంగా విజయం సాధించవచ్చని ఆ పార్టీ నేతల మాట.అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. ప్రచారానికి సంబంధించి ఎప్పటికప్పుడు నివేదికను అధినేత కేసీఆర్ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తున్నారు ఆ పార్టీ నేతలు. సెటిలర్స్ ఓట్లుపై ఫోకస్ చేయాలని, అందుకు ప్రత్యేకంగా ఓ టీమ్ ఏర్పాటు చేయాలని సలహా ఇచ్చేశారట.

వాళ్లనే టార్గెట్ చేసిందా?

మార్నింగ్ ఇంటింటికి ప్రచారం చేసేందుకు కొందరు నేతలతో ఒక టీమ్. సాయంత్రం ముఖ్యనేతలతో రోడ్ షోలకు మరొక టీమ్. రాత్రి వేళ సెటిలర్స్ కోసం మరో టీమ్ వర్కౌట్ చేస్తోందని అంటున్నారు. తొలుత కుల సంఘాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసింది. ఆసక్తి ఉన్నవారిని పార్టీకి ఆహ్వానించింది. అదే సమయంలో నియోజకవర్గంలో బలం ఉండి పోటీ చేయని పార్టీల నేతలపై ఫోకస్ చేసిందట కారు పార్టీ.ఏపీ విడిపోయిన తర్వాత తర్వాత మాగంటి గోపీనాథ్ టీడీపీ తరపున గెలిచారు. ఆ తర్వాత రాజకీయ కారణాల నేపథ్యంలో బీఆర్ఎస్‌లోకి వెళ్లినా, స్థానికంగా ఉండే టీడీపీ నేతలు, సానుభూతిపరులతో మంచి సంబంధాలు కొనసాగించారు. ఆ ఓటర్లను తమకు అనుకూలంగా మలచుకోవాలని ప్రయత్నం చేస్తోంది.రాజకీయ కారణాలతో టీడీపీ హైకమాండ్ వేరే పార్టీలకు మద్దతు ప్రకటించినా, స్థానికంగా ఉండే ఆ పార్టీ కేడర్ తనకు మద్దతు ఇస్తుందని సమయం, సందర్భం వచ్చినప్పుడు గోపీనాథ్ చెప్పేవారు. ఇప్పుడు ఆ ఫార్ములాను వర్కౌట్ చేయాలని ఆలోచన చేస్తోందట. టీడీపీ ఓట్లు.. కాంగ్రెస్-బీజేపీ వైపు వెళ్లకుండా ప్రచారంలో రకరకాల ఎత్తుగడలను వేస్తోంది బీఆర్ఎస్. గతంలో టీడీపీకి అనుకూలంగా బీఆర్ఎస్ నేతలు మాటల వీడియోలను తెరపైకి తీసుకొచ్చింది.వైసీపీ మద్దతుదారుల ఓట్లు కచ్చితంగా తమకే పడతాయని బలంగా నమ్ముతున్నారు బీఆర్ఎస్ పెద్దలు. ఈ క్రమంలో కూటమి పార్టీలపై ఫోకస్ చేసినట్టు కిందిస్థాయిలో గుసగుసలు లేకపోలేదు. టీడీపీ-జనసేన క్యాడర్‌ను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తోందట. గోపీనాథ్ తరహాలో సునీతకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారట. ఈ నేపథ్యంలో కూటమిలోని బీజేపీని కాదని టీడీపీ-జనసేన కేడర్.. బీఆర్ఎస్ వైపు ఎంతవరకు మొగ్గు చూపుతుందో చూడాలి.

## హిందూపురంలో వందేభారత్ స్టాప్

హిందూపురం, వందే భారత్ రైలు పది రోజుల్లోపు హిందూపురంలో ఆగుతుందని ఎంపీ బీకే పార్థసారథి తెలిపారు. హిందూపురానికి వచ్చిన ఆయన విలేకరలుతో మాట్లాడారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, తాను రైల్వేశాఖ సహాయమంత్రి సోమన్నతో మాట్లాడామని తెలిపారు. హిందూపురంలో వందే భారత్ రైలును ఆపేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని అన్నారు. రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు చేపడుతున్నామని అన్నారు. బళ్లారి నుంచి మడకశిర మీదుగా రైల్వే ట్రాక్ పనులు వేగంగా సాగుతాయని అన్నారు. చాకర్లపల్లి రైల్వే గేటువద్ద ల ఓవర్ బ్రిడ్జి పనులు త్వరలో ప్రారంభం అవుతాయని, దీనికి రూ.29 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఏడాదిలోపే పనులు పూర్తవుతాయని అన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని, రూ.92 కోట్లతో పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని అన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, పార్టీ కన్వీనర్ శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు ఆనంద్, చంద్రమోహన్, పట్టణాధ్యక్షులు వెంకటేశ్, మంగేష్ తదితరులు పాల్గొన్నారు.

# విషం చిమ్ముతున్న విభజన రాజకీయాలు



న్యూఢిల్లీ,భారతదేశం బలం, వైవిధ్యం రాజ్యాంగ నైతికత పై ఆధారపడి ఉంది. ఎన్నికైన నాయకులు పెడ ధోరణి పట్టినప్పుడు ప్రతిఘటించడం పౌరులు, ప్రతిపక్ష పార్టీలు, పౌరసమాజం, మీడియా విధి అవుతుంది. అన్యాయాలను మౌనంగా సహించడం అన్యాయాలను సమర్థిం చడమే. వలసలు, పోరాటం, సాంస్కృతిక ఐక్యతతో కూడిన ఉమ్మడి చరిత్రలతో ముడిపడి ఉన్న అసోం, బెంగాల్ రాష్ట్రాలు రెండు ద్వేష రాజకీయాల ప్రయోగశాలలుగా మారడానికి అనుమతించరాదు. వీరంతా భారతీయులే. ద్వేషపూరితమైన కంచెలు భౌగోళిక సరిహద్దుల కన్నా ప్రమాదకరమైనవి. అసోంలో అక్రమ వలసదారులను బహిష్కరిస్తామనడం, బెంగాల్‌లో బంగ్లాదేశ్ తో కంచెలు వేయమని హామీ ఇవ్వడం బిజెపి ద్వంద్వ ప్రమాణాలకు తార్కాణం. సిఎఎ ఈ వైఖరికి ప్రతీకగా నిలుస్తుంది.నైతికత స్థానే రాజకీయ ఆశయం చోటుచేసుకున్నప్పుడు పాలన మోసపూరితంగా మారుతుంది. అసోం నుంచి పశ్చిమ బెంగాల్ వరకూ అడుగడుగునా అదే కన్పిస్తోంది. పశ్చిమ బెంగాల్ కు చెందిన బిజెపి ఎంపి జగన్నాథ్ సర్కార్ తమ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తే, భారతదేశం బంగ్లాదేశ్ మధ్య ముళ్ల కంచెను తొలగిస్తుందని ఈ మధ్య చేసిన వ్యాఖ్య -వలసలు, సరిహద్దులు, జాతీయవాదంపై బిజెపి రాజకీయాల్లోని వైరుధ్యాన్ని స్పష్టం చేస్తున్నది. బంగ్లాదేశ్ నుంచి చొరబాటులను ఆపడం, ముఖ్యంగా అసోంలో అక్రమ వలసదారులను బహిష్కరించడంపై పార్టీ ఏళ్లుగా చేస్తున్న వాదనకు ఇది విరుద్ధంగా ఉంది. బిజెపి సీనియర్ ఎంపి చేసిన వ్యాఖ్య పశ్చిమ బెంగాల్ లోనే కాక, ఈశాన్య భారతంలో, మరీ ముఖ్యంగా అసోంలో ఆగ్రహాన్ని, అనుమానాలను రేకెత్తించింది. ఈ ప్రాంతంలో సరిహద్దు భద్రత, అక్రమ వలసలు దశాబ్దాలుగా రాజకీయంగా, భావోద్వేగ పరంగా సున్నితమైన అంశం.

అసోం ఒప్పందం, భద్రతా పరమైన రక్షణ

2016లో అసోంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పుడు, అది స్థానిక అసోమీ ప్రజల గుర్తింపు, హక్కులను కాపాడతామని స్పష్టమైన వాగ్దానం చేసింది. 2016, 2021 ఎన్నికల మేనిఫెస్టోలో బిజెపి 1985 అసోం ఒప్పందాన్ని అమలు చేస్తామని హామీఇచ్చింది. ఆల్ అసోం స్టూడెంట్స్, యూనియన్ (ఆసు) నేతృత్వంలో ఏళ్లతరబడి సాగిన ఆందోళన తర్వాత ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. అసోం నుంచి విదేశీయులను గుర్తించి బహిష్కరించడానికి 1971 మార్చి 25ను కటాఫ్ తేదీగా నిర్ణయించారు. మున్ముందు చొరబాట్లను నిరోధించడానికి భారత బంగ్లాదేశ్ సరిహద్దు వెంబడి కంచె వేయాలని కూడా ఈ ఒప్పందంలో పేర్కొన్నారు. అసోం ఒప్పందం కేవలం ఓ డాక్యుమెంట్ మాత్రమే కాదు. దేస జనాభా సమతౌల్యత కాపాడుకునేందుకు వందలాదిమంది అసోమీ యువకుల త్యాగాల ఫలితంగా సాధించుకున్న ఒప్పందం. ఇది రక్షణకు హామీ, అసోం భాష, సాంస్కృతిక, రాజకీయ గుర్తింపు నీరుగారబోదని ఇచ్చిన వాగ్దానం. అయినా, బిజెపి ఒప్పందం పట్ల విధేయత చూపుతోనే, పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) తీసుకువచ్చింది. ఇది ఒప్పందం ప్రాథమిక స్ఫూర్తిని సమర్థవంతంగా మోసం చేసే చట్టం. 1971 గడువు తర్వాత బంగ్లాదేశ్ నుంచి భారతదేశంలో ప్రవేశించిన హిందూ బెంగాలీలకు పౌరసత్వం ఇవ్వడంద్వారా బిజెపి అసోం ఒప్పందం ప్రాథమిక సూత్రాలకు విరుద్ధంగా ప్రవర్తించింది.సిఎఎ, అసోం ఉద్యమానికి నాయకత్వం వహించిన వారి త్యాగాలను దెబ్బతీయడమే కాక, బిజెపి ద్వంద్వ వైఖరిని బయటపెడుతుంది. ఒకపక్క ఇది ముస్లింలను చొరబాటుదారులు అని ఆరోపిస్తుంది, వారి బహిష్కరణకు వాగ్దానం చేస్తుంది. మరోపక్క ముస్లిమేతర వలసదారులకు, ముఖ్యంగా హిందూ బెంగాలీలకు పూర్తి పౌరసత్వాన్ని అందిస్తుంది. వీరిలో చాలా మంది 1971 తర్వాత బంగ్లాదేశ్ నుంచి భారతదేశంలోకి ప్రవేశించిన వారే. ఇది కేవలం రాజకీయ అవకాశవాదమే కాదు, భావజాలంతో కూడిన ద్రోహం.

వలసల విషయంలో బిజెపి ద్వంద్వ వైఖరి

వలసలపై బిజెపి రాజకీయాలు ఎప్పుడూ ద్వంద్వ ప్రమాణాలతో కూడినవే. అసోంలో ఆ పార్టీ నాయకులు అక్రమ బంగ్లాదేశ్ ముస్లింలను బహిష్కరణకు గగ్గోలు పెడుతున్నారు. బెంగాల్‌లో, కేంద్రంలో మరి కొందరు సరిహద్దులను తెరుస్తామని, ముళ్లకంచెలను తొలగిస్తామని హామీ ఇస్తున్నారు. చొరబాటు అంశం వివిధ రాష్ట్రాలలో ఎన్నికల లబ్ధి కోసం సాధనంగా ఉపయోగించుకుంటున్నట్లు కన్పిస్తోంది. భారతదేశ సరిహద్దులను రక్షించడం, అసోం ఒప్పందం పవిత్రతను కాపాడడంలో బిజెపికి నమ్మకం ఉంటే పార్టీ సీనియర్ ఎంపి, భారత- బంగ్లా సరిహద్దుల్లో ముళ్లకంచె తొలగిస్తామని ఎలా అంటారు. ఇది సరిహద్దు భద్రతకోసం అసోం ప్రజల పోరాటాన్ని అపహాస్యం చేయడం కాదా? ఈ అంశంలో వైరుధ్యం స్పష్టంగా కన్పిస్తోంది. అసోంలో లక్షలాది మందిని - "డి- ఓటర్లు", "చొరబాటుదారులు" అని ముద్రవేసిన కాషాయదళం ఇప్పుడు బెంగాల్‌లో బంగ్లాదేశ్‌తో సరిహద్దులు లేని ఐక్యతపై మాట్లాడుతోంది. ఇది జాతీయవాదం కాదు. కేవలం కపటత్వమే.

అసోం ముఖ్యమంత్రి ద్వేషపూరిత రాజకీయాలు

అసోం ముఖ్యమంత్రి ఈ విభజనను మరింత పెంచారు. విభిన్న సంస్కృతులు, భాషలు, విశ్వాసాలకు నిలయంగా ఉన్న అసోంలో కీలక పదవిలో ఉన్న ఆయన తన రాజకీయ వేదికను ద్వేషం, బహిష్కరణలకు వేదికగా మార్చుకు న్నారు. రాష్ట్రంలో కొన్ని తరాలుగా నివసిస్తున్న బెంగాలీ సంతతికి చెందిన ముస్లింలు, మియా ముస్లింలను- బహిష్కరిస్తామని తరచు ఆయన బెదిరించడం, రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వ వాగ్దానాన్ని ఉల్లంఘించడమే. ఆక్రమణలను తొలగించే నెపంతో వేలాది ముస్లిం కుటుంబాలను ఇప్పటికే ప్రభుత్వ, అటవీ భూములనుంచి బహిష్కరించారు. ఈ చర్యలు ముస్లింలు పెద్దసంఖ్యలో ఉన్న గ్రామాలను టార్గెట్ చేయడమే. అవి నిరాశ, ఆవేదనలను మిగిల్చాయి. కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలు బంగ్లాదేశ్ ముస్లింలకు ఆశ్రయం కల్పిస్తున్నాయని సిఎం పదేపదే చెప్పడం మతపరమైన విద్వేషాన్ని మరింత పెంచుతోంది. మతం ఆధారంగా విధేయత, ద్రోహం అని విభజించడం ఓ ప్రమాదకరమైన ప్రయత్నం. ఇది భారతదేశ, లౌకిక, ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమైన ఆలోచనే. ముఖ్యమంత్రి సొంత ప్రజల్లో ఒక వర్గంపై బహిరంగ యుద్ధం ప్రకటించడం, వారిని బయటి వ్యక్తులుగా ముద్రవేయడం పాలనా పరిమైన సమస్యమే కాదు, అది నైతిక సంక్షోభంగా మారుతుంది.

"అమర్ సోనార్ బంగ్లా" వివాదం

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన "అమర్ సోనార్ బంగ్లా" బంగ్లాదేశ్ జాతీయ గీతం. కాంగ్రెస్ నాయకులు ఈ గీతాన్ని పాడడంపై బిజెపి వివాదం సృష్టించడం అసంబద్ధతను ప్రతిబింబిస్తుంది. బ్రిటీష్ హయాంలో 1905లో బెంగాల్ విభజనకు నిరసనగా ఠాగూర్ రాసిన పాట విభజనకు కాదు. ఐక్యతకు సంబందించిన గీతం. మతపరమైన, రాజకీయ సరిహద్దులు ఏర్పడక ముందు బెంగాల్ సమైక్య వారసత్వాన్ని ప్రతిబింబించిన గీతం. అయినా, ఈ గీతం ఆలపించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బెదిరించడం, జాతి వ్యతిరేక గీతంగా ముద్రవేయడం దారుణం. వలసవాద వ్యతిరేక ప్రతిఘటన, ఠాగూర్ మానవతా వాదం సార్వత్రికను సూచించే పాట పట్ల అసహనం వ్యక్తం చేయడం దివాలా కోరుతనం. అభద్రతా భావాన్ని ప్రతిబింబిస్తుంది. కంచెలను తొలగించడం, బెంగాల్, బంగ్లాదేశ్‌లను ఏకం చేయడం గురించి మాట్లాడుతున్న అదే బిజెపి ఎంపి, అమర్ సోనార్ బంగ్లా పాటపట్ల అభ్యంతరం వ్యక్తం చేయడం విడ్డూరం.

ప్రజాస్వామ్యం, లౌకిక వాదానికి ముప్పు

1950లో భారత రాజ్యాంగం ఆమోదించినప్పుడు అది మతం, జాతితో సంబంధం లేకుండా, పౌరులు అందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాన్ని వాగ్దానం చేసింది. ప్రతి ముఖ్యమంత్రి పదవి చేపట్టే సమయంలో రాజ్యాంగాన్ని రాజకీయ లబ్ధికోసం వాడుకోనని వాగ్దానం చేస్తారు. అసోం ముఖ్యమంత్రి రాజ్యాంగ పదవిలో ఉంటూ, ఒక వర్గాన్ని లక్ష్యంగా ఎంచుకుని, వారిని ఇళ్లనుంచి వెళ్లగొట్టి, వారి పౌరసత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇది రాజ్యాంగం ఉల్లంఘనతో పాటు, ప్రజాస్వామ్యానికి ముప్పు భావించవచ్చు. అధికారంలో ఉన్నవారు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తే, ప్రజాస్వామ్యం పతనం మొదలవుతుంది. ఆ మనస్తత్వమే నిరంకుశ ధోరణులకు దారితీస్తుంది. భారతదేశం బలం, వైవిధ్యం రాజ్యాంగ నైతికతపై ఆధారపడి ఉంది. ఎన్నికైన నాయకులు పెడ ధోరణి పట్టినప్పుడు ప్రతిఘటించడం పౌరులు, ప్రతిపక్ష పార్టీలు, పౌరసమాజం, మీడియా విధి అవుతుంది. అన్యాయాలను మౌనంగా సహించడం అన్యాయాలను సమర్థించడమే. వలసలు, పోరాటం, సాంస్కృతిక ఐక్యతతో కూడిన ఉమ్మడి చరిత్రలతో ముడిపడి ఉన్న అసోం, బెంగాల్ రాష్ట్రాలు రెండు ద్వేష రాజకీయాల ప్రయోగశాలలుగా మారడానికి అనుమతించరాదు. వీరంతా భారతీయులే. ద్వేషపూరితమైన కంచెలు భౌగోళిక సరిహద్దులకన్నా ప్రమాదకరమైనవి. అసోంలో అక్రమవలసదారులను బహిష్కరిస్తామనడం, బెంగాల్‌లో బంగ్లాదేశ్ తో కంచెలు వేయమని హామీ ఇవ్వడం బిజెపి ద్వంద్వ ప్రమాణాలకు తార్కాణం. సిఎఎ ఈ వైఖరికి ప్రతీకగా నిలుస్తుంది. ఇటువంటి రాజ్యాంగ విరుద్ధమైన ప్రవర్తన ఇలాగే కొనసాగితే, భిన్నాభిప్రాయాలను నేరంగా పరిగణించే పరిస్థితి తలెత్తవచ్చు.

## ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ తప్పనిసరా?.. ప్రభుత్వం ఉపశమనం కలిగించాలి!

హైదరాబాద్,రాష్ట్ర విద్యాశాఖ సుప్రీంకోర్టు తీర్పు మేరకు పదవీ విరమణ కంటే ఐదేళ్లు ఎక్కువ సర్వీస్ ఉన్న వారందరూ టెట్‌కు హాజరు కావచ్చని, విద్యార్హతలలో జనరల్ అభ్యర్థులు 50 శాతం, రిజర్వేషన్ అభ్యర్థులు 45 శాతం మార్కులు పొందాలన్నది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయిస్తున్నట్లు తాజా జీవో 36లో వివరించింది. దీంతో సర్వీస్ ఉపాధ్యాయులు తమకు టెట్ తప్పనిసరి అవుతుందని ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం ఉపశమనం కలిగించాలి!

టెట్ తాజా మార్గదర్శకాలు ఇన్ సర్వీస్ టీచర్లను గందర గోళానికి గురి చేస్తున్నాయి. 2011 ఏప్రిల్ 16న విడుదలైన ప్రభుత్వ ఉత్తర్వు 51 రూల్ 11 ప్రకారం ఎన్‌సీటీఈ 2010 ఆగస్ట్ 8న ఇచ్చిన నాటి నోటిఫికేషన్ ప్రకారం, 2010 నాటికి డీఎస్సీ, ఇతర నియామక పద్ధతుల ద్వారా ఎంపికై పనిచేస్తున్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఉంటుందని తెలుపు తున్నది. అయితే దీన్ని తాజా ఉత్తర్వుల్లో ప్రస్తావించకపోవడం, సుప్రీంకోర్టు దృష్టికి తీసుకోకపోవడం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర నష్టానికి గురవుతున్నారు. ఇప్పటికే టెట్ అర్హత లేకుండా 30 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకొని ఉన్నవారికి టెట్ పరీక్ష తప్పే పరిస్థితి లేనట్లు కనిపిస్తున్నది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసి ఉపశమనం కలిగించాల్సిన అవసరం ఉంది.

ఈ అవకాశం చూడాలి!

ప్రస్తుత జీవో 36 రూల్ 9.2ను పరిశీలిస్తే 2012లో టెట్ పాసైన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు కూడా తాజా నోటిఫికేషన్ ప్రకారం మరలా ఉత్తీర్ణత కోసం టెట్ పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించింది. దీనివల్ల ముఖ్యంగా లాంగ్వేజ్ ఉపాధ్యాయుల పరిస్థితి సందిగ్ధంలో పడింది. అయితే టీచర్ ఎలి జిబిలిటీ టెస్ట్ అంటే ఒక అర్హత పరీక్ష మాత్రమే అయినందున అన్ని వర్గాల అభ్యర్థులకు కామన్ క్వాలిఫైడ్ మార్కులు ఉండడం న్యాయంగా భావించి ప్రభుత్వం ఆ అవకాశం కల్పించాలి. అలాగే ఇప్పటికే డీఎస్సీ పరీక్షలో మెథడాలజీ అంశాలను పరీక్షిస్తున్నందున టెట్‌లో మెథడాలజీ మినహాయించి గ్రూప్స్ పరీక్షలు తీరులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు అందరికీ కామన్ సిలబస్‌గా సైకాలజీ, పెడగాజి,



తెలుగు వ్యాకరణం, ఇంగ్లీష్ వ్యాకరణం, సాధారణ గణిత పరిజ్ఞానం, సాధారణ సైన్స్ పరిజ్ఞానం, సాధారణ సోషల్ పరిజ్ఞానం, అవసరమైతే కంప్యూటర్ ఐటీ వగైరా అన్నీ కలుపుకొని జనరల్ కంటెంట్‌తో సింగిల్ పేపర్ ఏర్పాటు చేస్తేనే ప్రతి ఒక్కరికి సమన్యాయం జరిగే అవకాశంపై విద్యాశాఖ ఆలోచించాల్సి ఉంది. అలా కాకుండా చేస్తే ఇన్ సర్వీస్ టీచర్లు ఉత్తీర్ణత పొందే అవకాశం లేనట్లు సిలబస్ ఉంది.

ఈ టీచర్లపై భారం మోపొద్దు!

సిలబస్ పూర్తి వివరాలను పరిశీలిస్తే గణిత సబ్జెక్టు, సైన్స్ సబ్జెక్టులకు కేవలం 20 మార్కులకు మాత్రమే సబ్జెక్టు ప్రశ్నలు వస్తాయి. సోషల్‌కు 60 మార్కులకు వస్తాయి. తెలుగు, ఇంగ్లీషు సబ్జెక్టుల వారికి 90 మార్కులకు ప్రశ్నలు వస్తాయి. సోషల్ సబ్జెక్టు కాంబినేషన్‌లో బిఏ గణితం చేసిన వారికి కేవలం 20 మార్కులకు మాత్రమే గణితం సిలబస్ పరిమితం చేయబడింది. సమాన భారంలో మార్కులు అనే సూత్రాన్ని ఆధారం చేసుకుని గణితం,సైన్స్ సబ్జెక్టులు కూడా కంటెంట్ మెథడాలజీ 60 మార్కులకు పెంచాలన్న అభ్యర్థుల కోరిక విద్యాశాఖ పరిశీలించాల్సి ఉంది. పెంచినప్పుడు మాత్రమే వెసులుబాటు కలుగుతుంది. వీటన్నింటిని రాష్ట్ర విద్యాశాఖ పరిశీలించి అందరూ అభ్యర్థులకు సమన్యాయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఇలా టెట్ అంశంలో జనరల్ అభ్యర్థులకు, ఇన్‌సర్వీస్ టీచర్లకు భారం కానున్న అంశాలపై రాష్ట్ర విద్యాశాఖ పునః సమీక్ష జరపాల్సి ఉంది.

## నైజీరియాలో క్రైస్తవులపై మారణహోమం

వాషింగ్టన్,నైజీరియాలో దాడులకు అమెరికా సిద్ధపడుతుందనే అనుమానాలు బలపడుతున్నాయి. అక్కడి వనరులపై ట్రంప్ కన్నుపడిందన్న ప్రచారం సాగుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా ట్రూత్‌లో నైజీరియా ప్రభుత్వం క్రైస్తవులను చంపడానికి అనుమతిస్తూనే ఉంది. అక్కడి ఇస్లామిక్ మిలిటెంట్ గ్రూపులు క్రిస్టియన్లపై దాడులు చేస్తున్నాయి. అమెరికా వెంటనే అన్ని సహాయాలను నిలిపేస్తుంది. ఇప్పుడు అమెరికా సైన్యం ఆ దేశంలోకి వెళ్లి ఇస్లామిక్ ఉగ్రవాదులను పూర్తిగా తుడిచిపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో నైజీరియా ఉలిక్కిపడింది. ఆఫ్రికా ఖండంలో 230 మిలియన్ల అత్యంత జనాభా కలిగిన దేశం నైజీరియా. ఈ జనాబాలో ముస్లింలు, క్రైస్తువులు దాదాపుగా సమానంగా ఉన్నారు. సాయుధ గ్రూపుల ఘర్షణలో అనేక మంది ముస్లిములు అధిక సంఖ్యలో మృతి చెందారు. బొకోహారం వంటి ఉగ్రవాద ముఠాల వల్ల అన్ని మతాలవారు మరణిస్తున్నారు. క్రైస్తవులే లక్ష్యం అనేదానికి స్పష్టమైన ఆధారాలు లేకున్నా, క్రైస్తవులు కూడా మరణిస్తున్నారు. నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు ట్రంప్ వ్యాఖ్యలను తిరస్కరించారు. తమ దేశంపై మత పరంగా అసహనం వ్యక్తం చేయడం సరికాదన్నారు. తమ ప్రభుత్వం నైజీరియన్లకు మతపరమైన స్వేచ్ఛ కోసం, వారి విశ్వాసాలను కాపాడటానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. పౌరులకు భద్రతను ప్రభుత్వం కల్పిస్తుందని, తీవ్రవాద అంతానికి అమెరికాతో సహా అంతర్జాతీయంగా కలిసి పనిచేస్తామని వెల్లడించారు. నైజీరియాలో సామూహికంగా క్రైస్తవులను హత్యలు చేస్తున్నందున మత స్వేచ్ఛను ఉల్లంఘించే దేశంగా గుర్తించాలని అమెరికా సెనేటర్ టెడ్ క్రూజ్ గత వారం కాంగ్రెస్‌లో ప్రకటించిన తరువాత ట్రంప్ ఈ బెదిరింపులకు చేయడం గమనార్హం. ట్రంప్ ఉద్దేశం వేరని, రక్షణ సాంకేతికత, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ వాహకాల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్, రాగి, లాందనం, నియోడైమియం, ప్రసోడైమియం వంటి కీలక ఖనిజ నిక్షేపాలు నైజీరియాలో ఉన్నాయని వాటి కోసమే ట్రంప్ బెదిరింపులని పలువురు విశ్లేషిస్తున్నారు.

## సింహం గుర్తుపై ఫోకస్..!

హైదరాబాద్,జాగృతి జనం బాటతో ప్రజల్లోకి వెళ్తున్నా ఎమ్మెల్సీ కవిత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. రాజకీయాల్లో కీరోల్ పోషించేలా సరికొత్త ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే సొంత కుంపటి కోసం గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్న కవిత..వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు జిల్లాల పర్యటన పెట్టుకున్నారు. వచ్చే ఏడాది మార్చి లేకపోతే ఏప్రిల్లో కవిత పార్టీ పెడుతారని..ఇప్పుడున్న తెలంగాణ జాగృతినే పార్టీగా మారుస్తారని ప్రచారం జరుగుతోంది.అయితే వచ్చే ఏప్రిల్లో తాను పార్టీ రిజిస్టర్ చేసి..ఎన్నికల గుర్తు వచ్చేలోపు చాలా ఎన్నికలు వస్తాయని లెక్కలు వేసుకుంటోందట కవిత. ఖైరతాబాద్ బైపోల్ రావొచ్చని అంచనా వేస్తున్నారట. అలాగే లోకల్ బాడీ పోల్స్..గ్రేటర్ ఎన్నికలు కూడా జరిగే అవకశాలున్నాయి. దీంతో ఈ అన్ని ఎన్నికల్లో కూడా పోటీ చేయాలని కవిత భావిస్తున్నారట.అయితే జాగృతి ఇంకా పార్టీగా ఆవిర్భవించకపోవడంతో పాటు పార్టీ గుర్తు కూడా లేకపోవడంతో ఆల్టర్నేట్ ఆప్షన్స్ మీద ఫోకస్ పెట్టారట కవిత. భవిష్యత్ జరిగే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ గుర్తుపై తన అభ్యర్థులను బరిలోకి దింపాలని చూస్తున్నారట కవిత.ఆల్ ఇండియా పార్వర్డ్ బ్లాక్ పార్టీ.. రాష్ట్రంలో రెబల్స్కు కేరాఫ్ గా ఉంటుంది. ప్రధాన రాజకీయ పార్టీల నుంచి టికెట్ దక్కని నేతలు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సింహం గుర్తుపై పోటీ చేసి..టికెట్ ఇవ్వని పార్టీలకు సవాల్ చేస్తుంటారు. భారీగా ఓట్లు చీల్చి తమ సత్తా చాటే ప్రయత్నం చేస్తుంటారు. గత ఎన్నికల్లో రామగుండం బీఆర్ఎస్ రెబల్గా పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సింహం గుర్తుపై పోటీ చేసి గెలుపొందారు.

ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థుల సత్తా

లోకల్ బాడీ ఎన్నికల్లోనూ ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులు సత్తా చాటారు. నేతాజి సుభాష్ చంద్రబోస్ ఐడియాలజీతో పురుడు పోసుకున్న పార్టీ కావడం..ఆ పార్టీ సింబల్ సింహం గుర్తు కావడంతో పోటీ చేయడానికి ఆసక్తి చూపుతుంటారు నేతలు. ఇప్పుడు బీఆర్ఎస్ టార్గెట్గా జనాల్లోకి వెళ్తున్న కవితకు సింహం తోడైతే రాజకీయాల్లో గర్జించడం ఇంకా ఈజీ అవుతుందని లెక్కలు వేస్తున్నారట జ్యోతిష్యులు.రెబల్స్ కు కేరాఫ్‌గా ఉన్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి కవిత లాంటి కరిజ్మా లీడర్ తోడైతే ఆ పార్టీకి జన బలం పెరిగే ఛాన్స్ ఉండగా..కవితకు కూడా ఆ పార్టీ సింబల్ కలిసి వస్తుందని భావిస్తున్నారట. అయితే సెంటిమెంట్, జాతకాలను విశ్వసించే కవితకు సింహం గుర్తు పొలిటికల్ గా కలిసి వస్తుందని జ్యోతిష్యులు, పండితులు కూడా చెప్పారట.అందుకే సింహం సింబల్ తో ప్రచారం సాగించాలనుకుంటున్నారట. ఇప్పటికే ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నేతలు..ఓ సింగరేణి కార్మిక సంఘ నాయకుడి మధ్యవర్తిత్వంతో కవితతో భేటీ అయినట్లుగా ప్రచారం జరుగుతుంది. కవితకు మెజారిటీ సీట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుండగా చర్చలు మాత్రం ఓ కొలిక్కి రాలేదట. అన్నీ అనుకున్నట్లు జరిగితే రానున్న స్థానిక ఎన్నికలే కవితకు తొలి టార్గెట్ అవడం ఖాయం.

### విద్యార్థి సంఘాల ఆందోళన...

తిరుపతి,శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో విద్యార్థినులపై ప్రొఫెసర్ వేధింపుల ఘటన కలకలం రేపింది. ఈ ఘటనపై రాజీ వ్యవహారాలు సాగడంతో విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. సైకాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ విశ్వనాథ రెడ్డి విద్యార్థినుల్ని వేధిస్తున్నారని, సీనియర్ విద్యార్థులతో ర్యాగింగ్ చేయిస్తున్నట్లు నలుగురు విద్యార్థినులు రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని గుట్టుచప్పుడు కాకుండా పరిష్కరించేందుకు మహిళా హాస్టల్ వార్డెన్లను పిలిపించి రాజీ ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం జరగడంతో విద్యార్థి సంఘాల నేతలు రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకొని ఆందోళనకు దిగారు. రెక్టార్ అప్పారావు బాధిత విద్యార్థినుల్ని తన ఛాంబర్‌కు పిలిపించి ప్రొఫెసర్ విశ్వనాథ రెడ్డితో రాజీ చేయించేందుకు ప్రయత్నించారన్న సమాచారం పై విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెక్టార్ ఛాంబర్ తలుపులు పగులగొట్టి లోపలికి దూసుకెళ్లారు.

### మరోమారు స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

హైదరాబాద్,గత కొన్ని రోజులుగా బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. సోమవారం స్వల్పంగా పెరిగి రూ.1.23 లక్షల మార్కు దాటిన బంగారం ధర మంగళవారం మళ్లీ దిగొచ్చింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో దేశంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.710 మేర తగ్గి రూ.1,22,460కు చేరుకుంది. 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధరలో రూ.650 మేర కోత పడి రూ..1,12,250కు దిగింది. వెండి ధర ఏకంగా రూ.3 వేల మేర తగ్గింది. ప్రస్తుతం కిలో వెండి రూ.1,51,000గా ఉంది .హైదరాబాద్, విజయవాడల్లో ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,22,460గా ఉంది. 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,12,250గా ఉంది. రెండు నగరాల్లో వెండి రేట్ కిలోకు రూ.1,65,000 వద్ద కొనసాగుతోంది. మదపర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు దిగడం, ఫెడ్ వడ్డీ రేట్ల కోతపై నానాటికీ సన్నగిల్లుతున్న ఆశలు, మళ్లీ పుంజుకున్న డాలర్ వెరసి బంగారం ధరలను తగ్గిస్తున్నాయని మార్కెట్ నిపుణులు

# ఆందోళన కలిగిస్తున్న వరుస ప్రమాదాలు



హైదరాబాద్, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. గత వారం కర్నూలు జిల్లాలో వేమురి కావేరి బస్సు ప్రమాదంలో 19 మంది సజీవ దహనమైన విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం తెల్లవారుజామున మూడు ట్రావెల్స్ బస్సులు ప్రమాదాలకు గురయ్యాయి. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం వద్ద అద్దంకి-నార్కట్‌పల్లి హైవేపై వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపుతప్పి ముందువెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాల య్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మిర్యాలగూడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా చెన్నే కొత్తపల్లి మండలం దామరాజు పల్లి దగ్గర జబ్బార్ ట్రావెల్స్ బస్సు ఓ ట్రక్కును ఢీ కొట్టింది. ఈ ఘటనలో బెంగుళూరుకు చెందిన ఓ మహిళ మరణించగా మరో 8 మంది గాయపడ్డారు. ఈ బస్సు బెంగళూరు నుంచి హైదరాబాద్ వస్తోంది. మృతురాలు బెంగళూరుకు చెందిన వారిగా గుర్తించారు. మరోవైపు.. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం జూబ్లీనగర్‌లో భారతి ట్రావెల్స్‌కి చెందిన బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదం లో ఒకరు మృతి చెందారు. పది మందికి గాయాలయ్యాయి. ఆయా ఘటనలపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే సోమవారం తెల్లవారు జామున చేవెళ్లలో జరిగిన ప్రమాదంలో 19మంది దుర్మరణం చెందారు. చేవెళ్లలో తెల్లవారక ముందే బస్సెక్కిన 19 మంది ప్ర యాణికుల బతుకులు తెల్లారేలోగా కానరానిలోకాలకు మరలిపోయాయి. గమ్యస్థానాలకు చేరుకోక ముందే తమ వారికి దూరమయ్యా రు. క్షేమంగా వెళ్లొచ్చని ఆర్టీసీ బస్సు ఎక్కిన వారికి కంకర టిప్పర్ రూపంలో మృత్యుశకటం ఎదురొచ్చి ప్రాణాలనే బలి తీసుకున్నది. నిద్రలో ఉన్నవారు కొందరు శాశ్వత నిద్రలోకి జారిపోయారు. కర్నూలు జిల్లా చిన్నటేకూరు సమీపంలో ట్రావెల్స్ బస్సు అగ్నిప్రమాదానికి గురై 19 మంది సజీవ దహనమైన ఘటనను మరువకముందే రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలోని మిర్జాగూడ గేట్ వద్ద సోమవారం తెల్లవారుజామున మరో ఘోర రోడ్డు ప్రమా దం జరిగింది. ఈ దుర్ఘటనలో టిప్పర్, బస్సు డ్రైవర్లు ఇద్దరు సహా 19 మంది దుర్మరణం పాలయ్యారు. తాండూరు నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును అతివేగంగా వచ్చిన కంకర టిప్పర్ బలంగా ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకున్నది. హైదరాబాద్- బీజాపూర్ హైవేపై చేవెళ్ల నుంచి వికారాబాద్‌కు కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ (టీజీ 06టీ3879) వాహనం ఎదురుగా అతి వేగంగా వచ్చి ఆర్టీసీ బస్సును ఢీకొట్టి, దానిపై పూర్తిగా ఒరిగిపోయింది. దానిలో ఉన్న కంకరమొత్తం బస్సులోకి జా రింది. దీంతో ఆర్టీసీ బస్సు కుడివైపున 8 వరుసల సీట్లు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. ఆ సీట్లలో కూర్చున్న కొందరు ప్రయాణికులు బలమైన గాయాలతో మరణించగా, మరికొందరు కంకరలో కూరుకుపోయి ఊపిరాడక వి లవిల్లాడుతూ చనిపోయారు.

# చంద్రబాబు సీరియస్ టూర్స్ వెనక కథేంటి?

అమరావతి,ఏపీ సీఎం చంద్రబాబుకాలికి బలపం కట్టుకొని తిరుగుతున్నారు. ఏడుపదుల వయసులో కూడా.. ఆయన కష్టపడుతున్న తీరు అభినందనీయమే. ప్రస్తుతం ఆయన లండన్ పర్యటనలో ఉన్నారు. ఆయన సతీమణి భువనేశ్వరికి అత్యుత్తమ అవార్డులు వచ్చాయి. ఆ అవార్డుల స్వీకరణకు గాను ఆయన సతీమణితో కలిసి లండన్ వెళ్లారు. అదే సమయాన్ని చంద్రబాబు సద్వినియోగం చేసుకుంటున్నారు. వచ్చే నెలలో విశాఖ వేదికగా జరగనున్న పెట్టుబడుల సదస్సుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను స్వాగతిస్తున్నారు. ప్రపంచ దిగ్గజ సంస్థలను ఆహ్వానిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే చంద్రబాబు గత కొద్దిరోజులుగా చేస్తున్న పెట్టుబడుల ప్రయత్నాలపై ఏపీవ్యాప్తంగా సంతృప్తి కనిపిస్తోంది. ప్రస్తుతం లండన్ పర్యటన కూడా ప్రతిష్టాత్మకంగా మారింది.



గట్టి ప్రయత్నాలు..

ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి 17 నెలలు అవుతోంది. నాలుగో సారి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించారు. అది మొదలు ఆయన ఈ రాష్ట్రానికి ఏదో చేయాలన్న తలంపుతోనే ఉన్నారు. అందుకు తగ్గట్టుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇప్పటివరకు పలుమార్లు విదేశీ పర్యటనలకు వెళ్లారు. దావోస్ లో పెట్టుబడుల సదస్సు మొదలు మొన్నటి సింగపూర్ పర్యటన వరకు ప్రతిదీ రాష్ట్రం కోసమే. అయితే లండన్ పర్యటనలో భాగంగా విశాఖపట్నం ఆహ్వానించాలని భావించారు. ఇంతలోనే ఆయన సతీమణి భువనేశ్వరికి ప్రతిష్టాత్మకంగా రెండు అవార్డులు లభించాయి. ఒకవైపు వ్యక్తిగత పర్యటన సాగిస్తూనే రాష్ట్రానికి పెట్టుబడుల అన్వేషణ కోసం చంద్రబాబు ప్రస్తుతం లండన్ లో బిజీగా ఉన్నారు.

విశాఖలో పెట్టుబడుల సదస్సు..

విశాఖలో ఈనెల 14 నుంచి మూడు రోజులపాటు పెట్టుబడుల సదస్సు జరగనుంది. దాదాపు పదిలక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే కొన్ని రకాల ఒప్పందాలు జరిగాయి. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వచ్చింది. అమెరికా వెలుపల, ఆసియా ఖండంలో అతిపెద్ద డేటా సెంటర్ ఇది. దానితోపాటు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సైతం వచ్చాయి. అయితే పది లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని ప్రచారం జరుగుతోంది. అయితే ఉద్యోగాల విషయంలో ఉత్తరాది రాష్ట్రాల వారు కూడా ఉంటారు. కానీ అన్నింటికీ మించి ఈ రాష్ట్రానికి పన్నుల రూపంలో ఆదాయం సమకూర్తుంది. ఆపై మౌలిక వసతుల కల్పనలో భాగంగా రియల్ ఎస్టేట్ కు ఎనలేని ప్రాధాన్యము లభిస్తుంది. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల్లో రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి ఏ సమావేశం జరిగిన ఏపీ గురించి చర్చ జరుగుతోంది. తద్వారా ఏపీకి భారీగా పెట్టుబడులు వస్తే రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకునే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వానికి అదే అవసరం కూడా. చంద్రబాబు ఆశపడుతోంది అదే.

# అమెరికా దుకాణం బంద్.. ఎన్నాళ్లీ సంక్షోభం



వాషింగ్టన్, అమెరికా కాంగ్రెస్ నిధుల బిల్లును ఆమోదించకపోతే, ఫెడరల్ సేవలు నిలిచిపోవడం 'గవర్నమెంట్ షట్‌డౌన్'గా పిలుస్తారు. ప్రస్తుతం అదే జరుగుతోంది. నిధుల విడుదలపై పాలక రిపబ్లికన్లు, ప్రతిపక్ష డెమోక్రాట్ల మధ్య విభేదాలు మరింత ముదురడంతో కేంద్ర ప్రభుత్వ విభాగాలు స్తంభించాయి. 33 రోజులుగా అగ్రరాజ్యం అమెరికాలో షట్‌డౌన్ కొనసాగుతోంది. లక్షలాది ఉద్యోగులకు జీతభత్యాలు నిలిచిపోయాయి.

నిలిచిపోయిన సబ్సిడీలు..

ప్రస్తుత షట్‌డౌన్ పేద అమెరికన్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దాదాపు 4 కోట్లకు పైగా ప్రజలకు లభించే ఆహార సబ్సిడీ కార్యక్రమాలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రవేశపెట్టిన ఆరోగ్య సంరక్షణ పథకం "ఒబామా కేర్". దానికి కేటాయించిన ఫెడరల్ సబ్సిడీలు ఈ ఏడాది చివరతో ముగియనున్నాయి. వాటిని పొడిగించాలనే డెమోక్రాట్ల డిమాండ్‌ను రిపబ్లికన్లు తిరస్కరించడంతో ప్రతిష్ఠంభన ఇంకా కొనసాగుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం ఒక టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "డెమోక్రాట్లతో ఒప్పందానికి వెళ్లే ప్రశ్నే లేదు. చివరకు వారే మమ్మల్ని సంప్రదిస్తారు" అంటూ తన దృక్పథాన్ని స్పష్టం చేశారు. ఆయన వ్యాఖ్యలతో ఈ సంక్షోభం త్వరగా ముగిసే అవకాశం కనిపించడం లేదు.

సెనెట్‌లో నంబర్ గేమ్..

100 సీట్ల సెనెట్‌లో నిధుల బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 60 ఓట్లు అవసరం. ప్రస్తుతం రిపబ్లికన్లకు 53 మంది, డెమోక్రాట్లకు 45 మంది సభ్యత్వం ఉంది. ఇద్దరు స్వతంత్ర సభ్యులు రిపబ్లికన్ వైపున ఉన్నా, చట్టం ఆమోదం పొందాలంటే కనీసం ఐదుగురు డెమోక్రాట్లు మద్దతు ఇవ్వాలి. కానీ ఒబామా కేర్‌కు సబ్సిడీలు కొనసాగించాలనే వారి షరతుతో ఒప్పందం కుదరడం కష్టతరం అవుతోంది.

ఆర్థిక సంక్షోభం..

ఫెడరల్ సేవల నిలుపుదలతో దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రతికూల సంకేతాలు కనిపిస్తున్నాయి. రవాణా, వాణిజ్య, పరిపాలనా విభాగాలు నిధుల కొరతతో కుదేలవుతున్నాయి. అవసరమైన చెల్లింపులు నిలిచిపోవడం వల్ల స్థానిక వ్యాపారాలకు కూడా దెబ్బతగిలింది. మార్కెట్‌లో మానసిక అనిశ్చితి పెరిగి, స్టాక్ సూచీలు క్రమంగా కిందికి జారుతున్నాయి.డెమోక్రాట్లు ఇది ట్రంప్ ప్రభుత్వ వైఫల్యం అని విమర్శిస్తుండగా, రిపబ్లికన్లు దేశ ఆర్థిక క్రమశిక్షణ కోసం తాత్కాలిక త్యాగం అవసరం అనే వాదనను ముందుకు తెస్తున్నారు. అయితే ప్రజా స్థాయిలో ఈ రాజకీయ పోరాటం ఆగ్రహాన్ని రగిలిస్తోంది. ఉద్యోగాలు, ఆహార భద్రతా పథకాలు, ఆరోగ్య సహాయం నిలిచిపోవడం సగటు అమెరికన్ కుటుంబాల జీవన ప్రమాణాలను ప్రభావితం చేస్తోంది. రిపబ్లికన్లు, డెమోక్రాట్ల మధ్య సాగుతున్న ఈ రాజకీయ బేరసారాలు కేవలం బడ్జెట్ వ్యవహారం కాకుండా, అమెరికన్ ప్రభుత్వ వ్యవస్థ స్థిరత్వానికి పరీక్షగా మారాయి. ట్రంప్ కఠిన వైఖరి కొనసాగితే, త్వరలోనే పెద్ద ఆర్థిక సంక్షోభం ఎదుర్కొనే ప్రమాదం ఉంది.

# శ్రీశైలంలో మరోమారు భారీ వర్షాలు

శ్రీశైలం, ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో మరోసారి భారీ వర్షాలు కురియడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.. శ్రీశైలం రాకపోకలు సాగించే భక్తులు అప్రమత్తంగా ఉండాల్సిన సమయం వచ్చింది.. శ్రీశైలం-హైదరాబాద్ ఘాట్ రోడ్డులో భారీ స్థాయిలో కొండచరియలు విరిగిపడ్డాయి..

మంగళవారం ఉదయం నుంచి శ్రీశైలంలో భారీ వర్షం కురుస్తోంది.. ఈ వర్షానికి శ్రీశైలం -హైదరాబాద్ ఘాట్‌రోడ్డులోని డ్డయమ్, స్విచ్ యార్డ్ సమీపంలో ఒక్కసారిగా పెద్ద పెద్ద కొండ చరియలు, బండరాళ్లు, చెట్లు విరిగి రోడ్డుపై అడ్డుగా పడిపోయాయి.. దీంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.. అయితే, కొండచరియలు, బండరాళ్లు, చెట్లు విరిగినపడిన ప్రాంతంలో.. ఆ సమయంలో వాహనాలు ఏమి లేకపోవడంతో.. పెను ప్రమాదం తప్పినట్టు అయ్యింది.. కొండచరియలు విరిగినపడిన సమయంలో.. ఆ ప్రాంతంలో కారు, బస్సు, లారీలు ఏదైనా ఉంటే భారీ నష్టం జరిగి ఉండేదని.. ప్రాణనష్టం కూడా జరిగి ఉండేదని.. ఆ సమయంలో అక్కడ ఏ వాహనం, భక్తులు ఎవరూ లేకపోడంతో.. అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.. వర్షం కురిసే సమయంలో ఘాట్ రోడ్డులో వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు అధికారులు..

# అమెరికా బాటలో కెనడా.. భారీగా విద్యార్థి వీసాలు తిరస్కరణ

టోరంటో,అమెరికా దారిలోనే కెనడా నిర్ణయాలు కూడా ఉంటున్నాయి. కెనడాలో భారతీయ విద్యార్థి వీసాలు భారీగా తిరస్కరణకు గురయ్యాయి. ఉన్నతవిద్య చదివేందుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి నలుగురిలో ముగ్గురు విద్యార్థి వీసాలను కెనడా అధికారులు తిరస్కరించారు. దీంతో భారతీయ విద్యార్థుల విషయంలో తీవ్రంగా వ్యవహరిస్తున్నట్లు అర్థం అవుతోంది. కెనడా ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ గణాంకాల ప్రకారం.. 2025 ఆగస్టులో భారతీయ విద్యార్థులు చేసుకున్న దరఖాస్తుల్లో 74 శాతం తిరస్కరణకు గురయ్యాయి. 2023లో ఆ మొత్తం 32 శాతంగా ఉంది. ఇదే సమయంలో చైనా విద్యార్థి వీసాల తిరస్కరణ రేటు 24 శాతంగా ఉండగా.. మిగతా దేశాల సగటు రేటు 40 శాతం మాత్రమే ఉండటం గమనార్హం. అంతర్జాతీయ విద్యార్థి వీసా కార్యక్రమాన్ని కఠినతరం చేసేందుకు కెనడా ప్రయత్నాలు కొనసాగిస్తోన్న తరుణంలో ఈ భారీ తిరస్కరణలు పెరిగాయి. మరోవైపు భారత్ నుంచి దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోతోంది. విదేశీ విద్యకు అమెరికా తర్వాతి స్థానంలో ఉన్న కెనడా.. గతేడాది దాదాపు 10లక్షల మంది విదేశీ విద్యార్థులకు అవకాశం కల్పించింది. వీరిలో 41శాతం భారత్ నుంచే ఉండగా.. ఆ తర్వాతి స్థానాల్లో చైనా, వియత్నాం దేశాలు ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇక భారీ స్థాయిలో విద్యార్థి వీసాల



దరఖాస్తులను కెనడా తిరస్కరించడానికి అక్కడి స్థానిక పరిస్థితులే కారణమని ఇమిగ్రేషన్ నిపుణులు అంచనా వేస్తున్నారు. నివాస కొరత, మౌలిక సదుపాయాల కల్పన ఇబ్బందిగా మారడం, స్థానిక ఖర్చులు విద్యార్థులు భరించగలరా? అన్న విషయాలపై ఆందోళనల నేపథ్యంలోనే కెనడా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. మరోవైపు అమెరికా, కెనడాలకు ప్రత్యామ్నాయం చూస్తున్న భారతీయ విద్యార్థులు జర్మనీ వైపు మొగ్గు చూపుతున్నట్లు మరో నివేదిక వెల్లడించింది.

# సుప్రీంకోర్టులో తెలంగాణ వ్యక్తి పిటిషన్!




హైదరాబాద్,హైకోర్టు న్యాయమూర్తి కావాలంటే ఏం చేయాలి? న్యాయశాస్త్రం చదవాలి. ప్రాక్టీసు చేయాలి. జడ్జీల నియామకానికి పెట్టే పరీక్షలు రాసి పాస్ అవ్వాలి. ఆ తరువాత చిన్న కోర్టులో జడ్జిగా వృత్తి ఆరంభించి అంచలంచెలుగా జిల్లాకోర్టుకు ఆ తరువాత హైకోర్టుకు వెళ్లవచ్చు.లేదంటే హైకోర్టులోనే ఓ పదేళ్లపాటు లాయర్‌గా ప్రాక్టీసు చేయాలి. చేపట్టిన కేసులు, న్యాయవాదిగా మీ ప్రవర్తనల ఆధారంగా బార్ కౌన్సిల్ సిఫారసుతో న్యాయమూర్తి అయ్యేందుకూ అవకాశం ఉంది. ఇవి రెండే మార్గాలు. కానీ.. జి.వి.శ్రవణ్ కుమార్ అనే వ్యక్తి ఇంకో మార్గం ఎంచుకున్నాడు. దేశ అత్యున్నత న్యాయస్థానంలో భంగపాటుకు గురయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి..జి.వి.శ్రవణ్‌కుమార్ అనే తెలంగాణ వ్యక్తి తనను హైకోర్టు న్యాయమూర్తిగా నియమించాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేశాడు. చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయి, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల బెంచ్ సోమవారం ఈ కేసును విచారించింది. శ్రవణ్‌కుమార్ న్యాయవాది పిటిషన్ వివరాలను తెలిపిన వెంటనే చీఫ్ జస్టిస్ ముందుగా ఆశ్చర్యపోయారు. "ఒక పని చేస్తా.. సుప్రీంకోర్టులోని సీనియర్ న్యాయమూర్తులు ముగ్గురితో కొలీజియమ్ మీటింగ్ ఇప్పుడే ఏర్పాటు చేస్తా.. ఓకేనా?" అంటూ వెటకారమాడారు. అక్కడితో ఆయన ఆగలేదు. "ఏంటిది? వ్యవస్థ అంటే నవ్వులాటగా మారిపోయింది మీకు. న్యాయస్థానంలో దరఖాస్తు చేసుకుంటే హైకోర్టు జడ్జిగా నియమిస్తారని మీరెక్కడ విన్నారు" అని పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కచ్చితంగా వ్యవస్థను వెక్కిరించడమేనని స్పష్టం చేశారు. చీఫ్ జస్టిస్ ఆగ్రహాన్ని గుర్తించిన పిటిషనర్ తరపు న్యాయవాది పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని అభ్యర్థించాడు. క్షమాపణ చెప్పారు. దీనిపై స్పందించిన జస్టిస్ బి.ఆర్.గవాయి.. "ఇలాంటి పిటిషన్‌ను స్వీకరించలేనని మీరైనా చెప్పి ఉండాల్సింది" అని మందలిస్తూ ఉపసంహరణకు అనుమతిచ్చారు. దేశంలో న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి ఒక కొలీజియమ్ వ్యవస్థ ఉన్న విషయం తెలిసిందే. సీనియర్ న్యాయమూర్తులతో కూడిన బృందం ఎంపిక చేస్తుంది. సుప్రీంకోర్టు ?ప్రధాన న్యాయమూర్తి ఎంపికకు ?కూడా ఐదుగురు సభ్యుల కొలీజియమ్ సిఫారసులు చేస్తే... ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి, దేశ ప్రధాని, హోం మంత్రులతో కూడిన బృందం ఆ పేర్లను పరిశీలించి ఒక నిర్ణయం తీసుకుంటుంది. ఈ నేపథ్యంలోనే తనను న్యాయమూర్తిగా నియమించాలని జి.వి.శ్రవణ్‌కుమార్ వేసిన పిటిషన్ చీఫ్ జస్టిస్ ఆగ్రహానికి కారణమైంది.

# తప్పుడు పోస్టులు పెడితే సహించం.. ఏపీ హోంమంత్రి అనిత వార్నింగ్

అమరావతి, సోషల్‌మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే సహించబోమని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. కల్పిత వీడియోల ద్వారా చాలామంది ఇబ్బంది పెడుతున్నారని.. అలాంటి వాటిని ఏపీ పోలీసులు సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ మధ్యకాలంలో ఉత్తరప్రదేశ్‌లో ఓ లారీపై రాళ్లు వేసిన వీడియోను.. ఏపీలో జరిగినట్లు ప్రచారం చేశారని మండిపడ్డారు. ఇలాంటి తప్పుడు వార్తలను ఏపీ పోలీసులు సమర్థవంతంగా ఎదుర్కొన్నారని తెలిపారు. ఇలాంటి వాటిని ఎదుర్కొనేందుకు పోలీసులకు అత్యాధునిక సాంకేతికతను అందజేస్తామని తెలిపారు.తుళ్లూరు పోలీస్ సబ్ డివిజన్ నూతన కార్యాలయాన్ని ఇవాళ అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఆఫీసును ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. 2014లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు అమరావతి నిర్మాణం ప్రారంభించారని తెలిపారు. కానీ 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఈ కార్యాలయం పూర్తి కాకుండా ఉందన్నారు. పోలీసులు వ్యవస్థను బలోపేతం చేసేందుకు డీజీపీ కృషి చేస్తున్నారని అన్నారు. పోలీసులకు కావాల్సిన అన్ని సదుపాయాలను కూడా ఈ ప్రభుత్వం



ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. పోలీసులకు కోటి రూపాయల బీమా కూడా అందిస్తున్నామని అన్నారు. అదే వైసీపీ ప్రభుత్వంలో ఒక్క కానిస్టేబుల్ ఉద్యోగంకూడా ఇవ్వలేదని విమర్శించారు. పోలీసు చనిపోతే.. వారి కుటుంబానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు.

# రేషన్ కార్డుదారులకు హెచ్చరిక.. ఈ పని చేయకుంటే రేషన్ కట్!



హైదరాబాద్, రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం నిరుపేదల కోసం ప్రతి నెల బియ్యం పంపిణీ చేస్తుంది. అయితే రేషన్ కార్డులు ఉన్నప్పటికీ బియ్యం తీసుకోని వారు చాలామంది ఉన్నారు.వారి రేషన్ కార్డు జారీ చేసినప్పటికీ వారు ఎలాంటి రేషన్ సరుకులు తీసుకోని వారు చాలా మందే ఉన్నారు. అలాంటి రాష్ట్రాలు కూడా నిఘా పెడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. అలాంటి వారిని అనర్హులుగా గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తోంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం కూడా రేషన్ తీసుకునే ప్రతి లబ్ధిదారుడు తప్పనిసరిగా ఒక పని చేయాలని సూచిస్తుంది.రేషన్ కార్డు వినియోగదారులు రేషన్ కార్డును పక్కదారి పట్టకుండా ఉండడం కోసం ఈ కేవైసీ తప్పనిసరిగా నమోదు చేయాలని ప్రభుత్వం పేర్కొంది. రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యులు మరణించినా రేషన్ పొందుతున్న వాళ్ళు, పెళ్లి చేసుకుని వెళ్లిన ఆడపిల్లల పేర్లు తొలగించకుండా బియ్యాన్ని పొందుతున్న వాళ్ళు చాలా మంది ఉన్నారు.

రేషన్ కార్డు దారులు తప్పనిసరిగా ఈ పని చెయ్యాలి:

ఈ నేపథ్యంలో ప్రతి నెల వందల క్వింటాళ్ళ బియ్యం దుర్వినియోగం అవుతున్నాయని ప్రభుత్వం గుర్తించింది. ఈకేవైసీ ప్రక్రియను తప్పనిసరి చేసింది. ఈ కేవైసీ నమోదు చేసుకోవడానికి ఇప్పటికే చాలాసార్లు అవకాశాలు ఇచ్చినప్పటికీ ఇంకా చాలామంది ఈ కేవైసీ పూర్తి చెయ్యలేదు. కొత్తగా రేషన్ కార్డులు పొందిన కుటుంబాలు కూడా తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని సూచిస్తున్నారు అధికారులు.రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఈకేవైసీ చేసుకోవడం తప్పనిసరి చేస్తోంది ప్రభుత్వం. ఈకేవైసీ పూర్తి చేయకపోతే ఆరు నెలల తర్వాత వారి కోటా బియ్యం తగ్గుతుందని స్పష్టం చేశారు. అంటే వరుసగా ఆరు నెలల పాటు ఈకేవైసీ చేయించుకోని లబ్ధిదారులు రేషన్ కోల్పోతారని పేర్కొన్నారు. అయితే ఇంకా కొన్ని రేషన్ కేంద్రాలలో ఈకేవైసీ ప్రక్రియ పూర్తికావడం లేదని డీలర్లు చెబుతున్నారు.ఇక చాలా మంది ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోలేదు. ఇక ఇప్పటికే చాలామంది ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతూ ఆధార్ అప్‌డేషన్ కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఇటు ఆధార్ అప్డేషన్, రేషన్ షాప్ లో ఈ కేవైసీ రెండు అప్డేట్ కాకపోవడంతో రేషన్ విషయంలో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకూడదని కొందరు లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కేవైసీ చేయించుకోనివారు రేషన్ కోల్పోయే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## రోడ్డుకు అడ్డంగా పడ్డ ట్రాక్టర్..నలుగురికి గాయాలు

నల్లగొండ,చేవెళ్లలో ఘోర బస్సు ప్రమాద ఘటన మరవక ముందే మరో యాక్సిడెంట్ జరిగింది. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం వద్ద అద్దంకి-నార్కట్‌పల్లి హైవేపై వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపుతప్పి ముందువెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న నలుగురు కూలీలు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మిర్యాలగూడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ట్రావెల్స్ బస్సు ఆంధ్రప్రదేశ్ లోని కావలి నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా ప్రమాదం జరిగిందని తెలిపారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఈ ఘటన జరిగిందన్నారు. ప్రమాద సమయంలో బస్సులో 45 మంది ప్రయాణికులు ఉన్నారని చెప్పారు. ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com